అభయ ఘోష
ప్రజాశక్తి ప్రత్యేక సంచిక
నేటి సంచికతో నాలుగు పేజీల ప్రత్యేక అనుబంధం..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 28 | విజయవాడ, బుధవారం 28 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 28 August 2024 | Rs

విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభ విజయవాడ బాలోత్సవ భవన్‌లో వామపక్షాల ఆధ్వర్యాన బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు.

ధరల దరువు

• సామాన్యుడు విలవిల • నెల ఖర్చులో సగం ఆహారానికే ! • పండగ వేళ కష్టకాలం

న్యూఢిల్లీ : నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు దాటి పరుగులు తీస్తున్నాయి. దీంతో సామాన్యుడి పరిస్థితి ఘోరంగా మారుతోంది. వినియోగ ధరల సూచీ ప్రకారం గత నెలలో ద్రవ్యోల్బణం 3.5 శాతానికి చేరింది. గత ఐదు సంవత్సరాల కాలంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఇంత తక్కువగా నమోదు కావడం ఇదే మొదటిసారని ప్రభుత్వం చెబుతోంది. అయినా, ప్రజల కష్టాలు తగ్గకపోగా, మరింతగా పెరుగుతుండటంతో ఈ లెక్కల విశ్వసనీయత ప్రశ్నార్ధకంగా మారింది. కీలకమైన ఆహార వస్తువుల ధరలు ఏమాత్రం తగ్గకపోవడమే దీనికి కారణం, వినియోగ ధరల సూచీలో ఆహారం, సంబంధిత వస్తువుల వాటా 46 శాతం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరింత ఎక్కువగా అంటే 54 శాతంగా ఉంది. ఫలితంగా సాధారణ భారతీయ కుటుంబం తన నెలసరి వ్యయంలో సగం ఆహారం, దాని అనుబంధ వస్తువుల కొనుగోలుకే ఖర్చు చేస్తోంది. వినాయకచవితి, దసరా, దీపావళి పండగల వేళ కష్టకాలం నెలకొనడం సామాన్యుడిని ఆందోళనకు గురిచేస్తోంది. రుతుపవనాల ద్వారా దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, కూరగాయల ఉత్పత్తిపై ఈ ప్రభావం పడటం కూడా దీనికి కారణం. కీలకమైన ఉల్లి, బంగాళాదుంపల ద్రవ్యోల్బణం జులై నెలలో 60.54, 65.64 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే సీజన్‌లో ఆలూ ఉత్పత్తి 6 శాతం, ఉల్లి ఉత్పత్తి 20 శాతం తగ్గింది. వర్షాలు కురవడంలో జాప్యం కారణంగా ఈ ఏడాది ఉత్పత్తి ఇంకా మార్కెట్‌లోకి రాలేదు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఆలూ ఉత్పత్తి అక్టోబర్‌లో మార్కెట్‌లోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈలోగా ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పప్పులు, నూనెల ధరలు పైపైకే చూస్తున్నాయి. దీంతో పెద్ద ఎత్తున దిగుమతులు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే, నెలవారీ తలసరి వ్యయంలో అధికశాతం ఆహారం మీద ఖర్చు చేయాల్సిరావడం ఏమాత్రం మంచిది కాదన్న అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

వడ్డీ రేట్లు తగ్గవచ్చు

రిటైల్ ద్రవ్యోల్బణం తక్కువగా ఉండడంతో ఆర్‌బిఐ భవిష్యత్తులో తన వడ్డీ రేట్లు తగ్గించవచ్చని కొందరు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. . దీనివల్ల పెట్టుబడులు, వినియోగం పెరుగుతాయని, దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని వారు అంటున్నారు. అయితే, కీలకమైన ఆహార ద్రవ్యోల్బణాన్ని వారు పట్టించుకోవడం లేదు.

పదిశాతం మందికే 25వేల కన్నా అధిక వేతనం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్‌నెస్ సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం భారతీయుల్లో కేవలం 10 శాతం మంది మాత్రమే నెలకు రూ.25,000 కంటే ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. అంటే అత్యధిక ప్రజానీకం నామమాత్రపు జీతాలతో నెట్టుకొస్తున్నారు. వీరందరికి కోవిడ్ తర్వాత కుటుంబ బడ్జెట్ నిర్వహణ కష్టంగా మారింది. ఇదే విషయమై సీఓటర్ డెయిలీ ట్రాక్ పోల్ అడిగిన ప్రశ్నకు నాలుగింట మూడు వంతుల మందికి పైగా అవుననే జవాబిచ్చారు.

రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం

నీతి ఆయోగ్ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు

వికసిత ఎపి -2047 డాక్యుమెంట్‌పై చర్చ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని 2047 నాటికి రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. నీతి ఆయోగ్ ప్రతినిధులతో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వికసిత్ ఎపి -2047 రూపకల్పనపై చర్చించారు. అప్పటికి 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేస్తున్నట్లు చంద్రబాబునాయుడు తెలిపారు. మాక్రో టు మైక్రో విధానం అవలంబించేలా చర్యలు తీసుకోనున్నామని వివరించారు. రానున్న ఐదేళ్లకు జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని హై వేల్యూ అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా రూపొందించడంతోపాటు పారిశ్రామికంగా యువతలో నైపుణ్యం పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. దేశ తూర్పుతీరానికి రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుదుత్పత్తికి కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వున్న ముఖ్య నగరాలను గ్రోత్‌సెంటర్లుగా మారుస్తామని, అందరికీ అత్యాధునిక వైద్యసేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పర్యావరణ అనుకూల అభివృద్ధిపై దృష్టి సారించేలా ప్రణాళికలను రూపొందిస్తామని వివరించారు. డిజిటల్ గవర్నెన్స్, ఆర్థికాభివృద్ధికి రాష్ట్రాన్ని ఓ నమూనాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులను మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలి

• సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రూప్-1 ప్రిలిమ్స్ నుండి మెయిన్స్‌కి 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2 డిప్యూటీ డిఇఓ పోస్టుల ఎంపికలో 1:100 విధానాన్ని అనుసరించారని, దీన్నే గ్రూప్-2ఎంపికలో కూడా కొనసాగించడం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రూప్-2, గ్రూప్-1 పరీక్షలకు మధ్య సమయం తక్కువగా ఉండటం, ప్రశ్నాపత్రంలో అనువాద సమస్యలు, కేవలం మూడు వారాల వ్యవధిలోనే రెండు పరీక్షలు జరిగాయని తెలిపారు. వాటితోపాటు ఎన్నికల ఒత్తిడి, గ్రూప్-1 సిలబస్‌ను రివిజన్ చేయకపోవడం, కొత్త సిలబస్ అని చెప్పి పాత సిలబస్‌తోనే ప్రిలిమ్స్ పరీక్షలు పెట్టడంతో అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిపారు. అభ్యర్థుల జీవితాలకు సంబంధించిన అంశం కనుక రాష్ట్ర ప్రభుత్వం దీనిపై వెంటనే సాధ్యాసాధ్యాలను పరిశీలించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

75 మంది గురుకుల విద్యార్థులకు అస్వస్థత

• కలుషిత ఆహారమే కారణం?

2

విద్యార్థులు, డ్వాక్రా మహిళలకు ఎలక్ట్రిక్ సైకిళ్లు

• సిఎం వద్ద ఇఇఎస్ఎల్ ప్రతిపాదన

2

కంగనా వ్యాఖ్యలకు ప్రధానిదే బాధ్యత

• రైతాంగ మహా ఉద్యమంపై విషం చిమ్మడం సిగ్గుచేటు
• రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి, ఎపి రైతు సంఘం

3

వయనాడ్ పునరుజ్జీవనానికి సహకరించండి

• ప్రధాని మోడీకి కేరళ సిఎం పినరయి విజయన్ వినతి

5

నాసిన్, బెల్ భూ నిర్వాసితుల ధర్నా

• పెనుకొండ సబ్ కలెక్టరేట్ ఎదుట వంటావార్పు
• ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి : సిపిఎం

వంటావార్పు నిరసన కార్యక్రమంలో నాయకులు, నిర్వాసితులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నాసిన్, బెల్ భూ నిర్వాసితులు ఆందోళనకు దిగారు. సిపిఎం ఆధ్వర్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 48 గంటల వంటావార్పు నిరసన కార్యక్రమం చేపట్టారు. పరిశ్రమలకు భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ డివిజన్ పరిధిలో పాలసముద్రం, కావేటి నాగేపల్లి, చిన్న బాబయ్యపల్లి గ్రామాలకు చెందిన నాసిన్, బెల్ భూ నిర్వాసితులు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని గత మూడు సంవత్సరాల నుంచి నిర్వాసితులు కోరుతున్నా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సాగుభూములను పరిశ్రమల కోసం ఇచ్చి రైతు కుటుంబాలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. భూములు తీసుకున్నప్పుడు ఒకమాట, తర్వాత మరోమాట మాట్లాడి రైతులకు పాలకులు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వస్తే స్థానికంగా తమ పిల్లలకు ఉపాధి లభిస్తుందన్న ఆశతో సాగు భూములను పరిశ్రమల కోసం తక్కువ ధరకు పేద రైతులు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు జోక్యం చేసుకుని నిర్వాసితులకు చట్టం ప్రకారం ఇవ్వాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షులు ప్రవీణ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌తో పాటు సిపిఎం ప్రజాసంఘాల నాయకులు, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

జిఒఐఆర్ వెబ్‌సైట్ పునరుద్ధరణ

• రేపటి నుంచి అందుబాటులోకి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉత్తర్వుల విడుదల నమోదు (జిఒఐఆర్) వెబ్‌సైట్‌ను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జిఓ 79ను మంగళవారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే పాలనాపరమైన నిర్ణయాలు ప్రజలకు తెలిసేందుకు goir.ap.gov.in వెబ్‌సైట్‌ను 2008 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వులు ఈ వెబ్‌సైట్‌లో ఉండేవి. అయితే గత వైసిపి ప్రభుత్వం 2021 సెప్టెంబరు 7 నుంచి ఈ వెబ్‌సైట్‌ను పక్కన పెట్టి ఎపిఇగెజిట్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ గెజిట్ వెబ్‌సైట్‌లో అన్ని ఉత్తర్వులను కాకుండా కేవలం కొన్నింటిని మాత్రమే పొందుపరిచింది. ప్రభుత్వ పాలనాపరమైన నిర్ణయాలను ప్రజలకు తెలిసేలా జిఒఐఆర్‌ను పునరుద్ధరించాలని గతంలో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. అన్ని ఉత్తర్వులనూ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ప్రభుత్వం కోర్టుకు చెప్పినా ఆచరణలో మాత్రం పాటించలేదు. జిఒఐఆర్ పునరుద్ధరణ పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిలు

• తీహార్ జైలు నుంచి విడుదల
• భావోద్వేగానికి లోనైన కెసిఆర్ తనయ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అయిదు మాసాలుగా తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత మంగళవారం బెయిలుపై విడుదలయ్యారు. ఆమె దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై జస్టిస్ బి ఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం రూ. 10 లక్షల పూచీకత్తుపై షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. కవిత తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహ్తగి, వాదించగా, ఇడి తరుపున ఎస్వీ వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం కోర్టు ఆమెకు బెయిలు మంజూరు చేసింది. దీంతో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆమె తీహార్ జైలు నుంచి బయటకొచ్చారు. స్వాగతం పలకడానికి వచ్చిన కొడుకు ఆర్య, భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీష్ రావును చూసి కవిత భావోద్వేగానికి లోనయ్యారు. వారిని పట్టుకుని బోరున ఏడ్చేశారు. ఆ తరువాత తమాయించుకున్నారు.

నన్ను జగమొండిని చేశారు: కవిత

జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరు కవిత మీడియాతో మాట్లాడుతూ, తనను, తన కుటుంబాన్ని ఇబ్బందికి గురిచేసిన వారు వడ్డీతో సహా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు. తాను ఇప్పుడే ఎవరి గురించి చెప్పాల్సిన అవసరం లేదని. తాను మొండిదాన్నే కానీ, మంచి దాన్ని అన్నారు. జైలుకు పంపి నన్ను జగమొండిని చేశారని అన్నారు.

మార్చి 26 నుంచి జైల్లోనే

ఈ ఏడాది మార్చి 15న సోదాల పేరుతో ఇడి అధికారులు హైదరాబాద్ లోని కవిత నివాసానికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం 5:20 నిమిషాలకు కవితను అరెస్ట్ చేసి అర్ధరాత్రి ఢిల్లీలోని ఇడి హెడ్డాఫీస్‌కు తరలించారు. ఆ తరువాత ప్రత్యేక కోర్టు ముందు ఆమెను హాజరుపరచగా జ్యూడిషియల్ రిమాండ్ విధించారు. అప్పటి నుంచి ఆమె తీహార్ జైలులోనే ఉన్నారు.

రేవంత్ , బండి మధ్య చీకటి ఒప్పందం: బిఆర్ఎస్

కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య చీకటి ఒప్పందం ఉందని మిగతా 5లో

విషజ్వరాలపై నిపుణుల కమిటీ

• వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశం
• వారానికోసారి సమీక్షించాలని కలెక్టర్లకు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విషజ్వరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను సూచించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ హరికిరణ్ ఛైర్మన్‌గా, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ పద్మావతి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో పంచాయతీరాజ్ కమిషనర్, మున్సిపల్‌శాఖ కమిషనర్, ఐటిడిఎ పాడేరు పిఒ, మైక్రోబయాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ ఎక్స్‌పర్ట్, మరో ఇద్దరు వైద్య నిపుణులు సభ్యులుగా ఉండనున్నారు. సీజనల్ వ్యాధులపై మంగళవారం మంత్రి సమీక్షించారు. డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియాతో ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్లు వారానికోసారి జ్వరాలు, సీజనల్ వ్యాధులపై సమీక్ష జరపాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులతో మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు సమీక్ష జరపాలని పేర్కొన్నారు.

విషజ్వరాలు, సీజనల్ వ్యాధులపై సమర్ధవంతమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కిందిస్థాయి సిబ్బంది కేసులను గుర్తించిన వెంటనే పరీక్షచేసి ల్యాబ్‌కు పంపించాలని తెలిపారు. పారిశుధ్యం, ఇంట్లో ఫాగింగ్ వంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వీటిపై గతంలోనే పలుమార్లు సమీక్షించినా పరిస్థితిలో మార్పులేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రమాదమని తెలిసినా పర్యావరణ అనుమతులా ?

• నేడు కుసులవాడ కొండ మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్న చిన్నయ్యపాలెం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ గ్రామ సమీపంలోగల తెల్లమెట్ట కొండపై మైనింగ్ జరపడం పర్యావరణంపై ప్రభావం చూపుతుందంటూ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్ (ఇఐఎ) నివేదికలో స్పష్టంగా తెలిపినా ప్రభుత్వం, అధికార యంత్రాంగం మైనింగ్ లీజును రద్దు చేయకుండా ముందుకెళ్తున్నాయి. బుధవారం ఉదయం 11 గంటలకు ఈ కొండపై మైనింగ్‌కు సంబంధించి చిన్నయ్యపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగనుంది. ఈ కొండకు 10 కిలోమీటర్ల వ్యాసార్థంలో 1.50 లక్షల మంది జనాభా 57 గ్రామాల్లో నివసిస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు 1.89 శాతం మంది ఉన్నారు. వన్యప్రాణులకు నిలయమైన కంబాలకొండ ఏరియా 4.93 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇండో టిబెట్ బోర్డర్ రక్షణ సంస్థ శిక్షణాలయం మూడు కిలోమీటర్ల దూరంలోనూ, గ్రేహౌండ్స్ వింగ్ రెండు కిలోమీటర్ల దూరంలోనూ ఉన్నాయి. ఎపి పోలీస్ ఫైరింగ్ రేంజ్ అర కిలోమీటరు దూరంలోనే ఉంది. మైనింగ్ సమయంలో దుమ్ము రేగుతుందని, లోతట్టు ప్రాంతాల నీరు కలుషితమవుతుందని పర్యావరణ ప్రభావ అంచనాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. కుసులవాడ గ్రామంలోని సర్వే నెంబరు 104లో 7.99 హెక్టార్ల మేర ఈ కొండ విస్తరించి ఉంది. పోరంబోకు, కొండ అయిన కంకర, క్వార్ట్జ్, రఫ్ స్టోన్ క్వారీ లీజును గత ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ తాజాగా చంద్రబాబు కూటమి సర్కారు ఆమోద ముద్ర వేస్తూ పబ్లిక్ హియరింగ్ నిర్వహణకు బుధవారం సిద్ధమైంది. క్వార్ట్జ్ నుండి యురేనియం ను వెలికి తీయగడానికి అవకాశాలు న్నాయని నిపుణులు చెబుతున్నారు. దీనిపైనా అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో ఈ వ్యవహారంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

130 పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 130 పాఠశాలలు క్రీడా ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు విజయరామరాజు తెలిపారు. జిల్లాకు ఐదు పాఠశాలలు చొప్పున ఎంపిక చేశామని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పాఠశాలల్లో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ క్రీడా దినోత్సవం రోజు అన్ని పాఠశాలల్లో క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలని పేర్కొన్నారు. క్రీడా ప్రతిభా అవార్డుల ప్రధాన కార్యక్రమంలో జిల్లా అధికారులు, రాజకీయ ప్రముఖుల చేతులమీదుగా అవార్డులు సాధించిన పాఠశాలలను గౌరవించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో 1,040 పాయింట్లతో కడప మెయిన్ మున్సిపల్ హైస్కూల్ ప్రథమ స్థానం, 1,008 పాయింట్లతో ఎన్‌టిఆర్ జిల్లాలోని నున్న జిల్లా పరిషత్ హైస్కూల్, 963 పాయింట్లతో చిలకలూరిపేట ఎఎంజి హైస్కూల్ మూడో స్థానం సాధించాయని వివరించారు.

గ్రీవెన్స్ తరువాతే పని సర్దుబాటు : ఫ్యాప్టో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా మండల స్థాయిలో గ్రీవెన్స్ పరిష్కారం కాకుండా డివిజన్ స్థాయి పని సర్దుబాటు చేసే ప్రయత్నం చేయడం సరికాదని ఫ్యాప్టో తెలిపింది. మండల స్థాయి గ్రీవెన్స్ పరిష్కరించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు విజయరామరాజును ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్ సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి మంగళవారం కోరారు. ప్రభుత్వం మార్గదర్శకాల్లో ఇచ్చిన విధంగా సీనియార్టీ జాబితాను మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం చేయాల్సి ఉందని తెలిపారు. కాని వచ్చిన జాబితాపై గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే డివిజన్ స్థాయి సర్దుబాటు చేయడానికి అధికార యంత్రాంగం సన్నద్ధం కావడం సరికాదన్నారు. డివిజన్ స్థాయిలో పని సర్దుబాటుకు సంబంధించిన గ్రీవెన్స్ కూడా పరిష్కారం అయ్యాకే డివిజన్ పరిధిలో చేపట్టాలని కోరారు. వెంటనే ఈ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు హైదరాబాద్‌లోని సిబిఐ కోర్టు అనుమతి ఇచ్చింది. యుకెలో చదువుకుంటున్న కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 3 నుంచి 25 వరకు ఆ దేశం వెళ్లేందుకు బెయిల్ షరతులు సడలించి అనుమతివ్వాలని జగన్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిసినప్పటికీ న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు. మంగళవారం తీర్పు ప్రకటించారు. విదేశీ పర్యటన వివరాలు, ఫోన్ నెంబర్, మెయిల్ ఐడిలను సిబిఐకి అందజేయాలని కోర్టు జగన్‌ను ఆదేశించింది. పాస్‌పోర్ట్ గడువు ముగిసిన నేపథ్యంలో మరో ఐదేళ్ల కాలపరిమితితో కొత్త పాస్‌పోర్ట్ జారీకి కూడా న్యాయస్థానం నుంచి అనుమతి లభించింది.

బదిలీల గడువు పెంచాలని వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల అభ్యర్థనను నమోదు చేసే గడువును మరో వారం రోజులు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సచివాలయశాఖ డైరెక్టరు శివప్రసాద్‌కు ఫెడరేషన్ అధ్యక్షులు ఎమ్‌డి జానీ పాషా మంగళవారం వినతిపత్రం అందజేశారు. బదిలీలు కోరుకోకుండా ఉన్న సచివాలయ ఉద్యోగులను బలవంతంగా బదిలీలు చేయకుండా నిరోధించాలన్నారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- ఎపిఎస్‌బిసిఎల్ మాజీ ఎమ్‌డి వాసుదేవరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి

సిఐడి పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఎపి స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌బిసిఎల్) మాజీ ఎమ్‌డి డి వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనికి చెందిన పూర్తి వివరాలు అందజేయాలని పోలీసులకు జస్టిస్ విఆర్ కృపాసాగర్ మంగళవారం ఆదేశించారు. ఎపిఎస్‌బిసిఎల్ కార్యాలయం నుంచి ఆ సంస్థకు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలను వాసుదేవరెడ్డి తీసుకువెళుతుంటే చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ చేసిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరుకు విజయవాడ కోర్టు నిరాకరించడంతో ఆయన హైకోర్టులో అప్పీల్ చేశారు. విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

శాంతిభద్రతల విఘాతంపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో విధ్వంస చర్యలు పెరుగుతున్నాయని, హత్యలు పెరుగుతున్నాయని, విజయవాడలోని బిఆర్ అంబేద్కర్ మహా శిల్పంపై దాడి కూడా జరిగిందని, ఈ వ్యవహారాలపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. సామాజిక కార్యకర్త పరిశపోగు శ్రీనివాసరావు మంగళవారం పిల్ వేశారు. విగ్రహాలు ధ్వంసం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలని, కేసుల రికార్డులన్నింటినీ సమర్పించేలా ఆదేశాలివ్వాలని పిల్‌లో పేర్కొన్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు, విజయవాడ పోలీస్ కమిషనరు, కేంద్ర హోంశాఖ కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి యుపిఎస్ అమలు

- విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

ప్రజాశకి - అమరావతి బ్యూరో

యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) వచ్చే ఆర్థిక సంవత్సరం 2015-26 నుంచి అమల్లోకి రానుందని విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. విజయవాడ డిఆర్ఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్) చందాదారులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ యుపిఎస్‌ను ఎంచుకోవచ్చన్నారు. విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసరు కట్టా ఆనంద్ మాట్లాడుతూ.. యుపిఎస్‌ను ఒకసారి ఎంపిక చేసుకుంటే మళ్లీ ఎన్‌పిఎస్‌కు మారే అవకాశం ఉండదన్నారు

75 మంది విద్యార్థులకు అస్వస్థత

కలుషిత ఆహారమే కారణం?

ప్రజాశక్తి - ఏలేశ్వరం(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 75 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కలుషిత ఆహారం తినడం వల్లే అస్వస్థతకు గురైనట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున ఐదుగురు విద్యార్థులు వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. వెంటనే వారిని ఏలేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మరి కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంతో వారిని కూడా ఆస్పత్రికి తరలించారు. మొత్తం 75 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఏలేశ్వరం పిహెచ్‌సి సూపరిండెంట్ డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో వైద్య బృందం వారికి వైద్యసేవలు అందించింది. సోమవారం మధ్యాహ్నం భోజనంలో క్యారెట్, పచ్చి శనగపప్పుతో కలిపిన కూర, సాయంత్రం పచ్చి శనగపప్పు, క్యాబేజీతో కలిపిన కూరను వడ్డించినట్టు విద్యార్థినులు తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామని, ఆహారం, నీటి నమూనాలను ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. పాఠశాలలో తాగునీటి ట్యాంకును, పైపులైన్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఈ పాఠశాలలో మొత్తం 605 మంది విద్యార్థులు ఉన్నారని, మిగిలిన విద్యార్థులందరూ బాగానే ఉన్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కాకినాడ జిల్లా కార్యదర్శి గంగాసూరిబాబు విద్యార్థులను పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై విచారణ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులు, డ్వాక్రా మహిళలకు ఎలక్ట్రిక్ సైకిళ్లు

సిఎం వద్ద ఇఇఎస్ఎల్ ప్రతిపాదన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్వాక్రా మహిళలు, విద్యార్థులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను సబ్సిడీతో అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇఎస్ఎల్) సిఇఒ విశాల్ కపూర్ ప్రతిపాదించారు. పిఎంఎవై పథకంలో భాగంగా ఇళ్లకు ఇంధన సామర్థ్య పరికరాలను సబ్సిడీలో అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇ-సైకిళ్లు, విద్యుత్ పరికరాలు అందిస్తామని తెలిపారు. విశాల్ కపూర్‌తో పాటు ఆ సంస్థ ప్రతినిధులతో సచివాలయంలో ముఖ్యమంత్రి మంగళవారం సమావేశమయ్యారు. ఎలక్ట్రికల్ సైకిల్ మోడళ్లను ముఖ్యమంత్రికి చూపించడంతో పాటు పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఎపిని బెస్ట్ ఎనర్జీ ఎఫిషియంట్ (ఉత్తమ ఇంధన సామర్థ్యం) రాష్ట్రంగా మార్చుతామన్నారు. ఇఇఎస్ఎల్‌తో గృహ నిర్మాణం, ఇంధన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ సహా పలు కీలక విభాగాలు కలిసి పనిచేస్తాయని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఆర్థికంగా, పర్యావరణ పరంగా లబ్ధిచేకూరేలా విధానాలు ఉండాలని, ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఆర్‌టిసిలోనూ పెద్దయెత్తున విద్యుత్ వాహనాలను ప్రమోట్ చేస్తున్నామని, ప్రభుత్వ భవనాల్లోనూ సోలార్ వినియోగం పెంచబోతున్నట్లు తెలిపారు. గతంలో 25 లక్షల ఎల్ఇడి వీధి దీపాలు ఏర్పాటు చేశామని, గత ప్రభుత్వం వీటి నిర్వహణను గాలికొదిలేసిందని విమర్శించారు. దీనివల్ల 60 శాతం దీపాలు వెలుగుతున్నాయని చెప్పారు. త్వరలో మళ్లీ ఎల్ఇడి దీపాల వెలుగులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు ఎ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల వేతనం పెంపు

- ఆలయ ఆస్తుల పరిరక్షణకు కమిటీ
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అర్చకులకు వేతనం పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. నెలకు రూ.10 వేలు ఉన్న వేతనం ఇకపై రూ.15 వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖపై సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. వేతనం పెంపు ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.10 కోట్లు భారం పడుతుందన్నారు. దూప దీప నైవేద్యం కోసం ఆలయాలకు ఇచ్చే మొత్తం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఏడాదికి రూ.32 కోట్లు అదనపు భారం పడుతుందన్నారు. వేద విద్య చదువుకుని నిరుద్యోగులుగా ఉన్నవారికి నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలన్నారు. నాయీ బ్రాహ్మణులకు కనీసం రూ.25 వేలు వేతనం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ ట్రస్టు బోర్డుల్లో ఇద్దరు చొప్పున బోర్డు సభ్యులను అదనంగా తీసుకుంటామన్నారు. రిలీజియస్ టూరిజం ప్రమోషన్ కోసం దేవాదాయ, అటవీశాఖ, పర్యాటకశాఖల మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయమనున్నట్లు వెల్లడించారు.

ప్రారంభం కాని పనులు నిలిపివేత

సిజిఎఫ్ కింద 243 పనులు, టిటిడి శ్రీవాణి ట్రస్టు కింద వివిధ ప్రాంతాల్లో తలపెట్టిన 1,797 పనులు ప్రారంభం కాలేదని, వాటిని నిలుపుదల చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఇప్పటికే మొదలైన పనులను పూర్తి చేయాలన్నారు. ఆలయాల ఆస్తుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రైవేటు సెక్టారు భాగస్వామ్యంతో హోటళ్ల నిర్మాణం చేపట్టి యాత్రికులకు వసతులు కల్పించాలన్నారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ పాల్గొన్నారు.

సినీ నటి కేసులో సజ్జల పాత్ర తేల్చాలి

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముంబయి సినీ నటి కేసు దర్యాప్తు జరిపి సజ్జల పాత్ర ఏంటో తేల్చాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేసినట్లుగా ఏ ముఖ్యమంత్రి చేయలేదని పేర్కొన్నారు. వైసిపి నాయకుడికి, బాలీవుడ్ సినీ నటికి మధ్య జరిగిన చీకటి భాగోతానికి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నీ తానై కథ నడిపినట్లు తెలుస్తోందని ఆరోపించారు. అప్పటి విజయవాడ పోలీస్ కమిషనరు రాణా చిన్న కేసులో విమానంలో ముంబయి వెళ్లి అరెస్టు చేసి తీసుకురావాల్సిన అవసరం లేదన్నారు. మొవ్వలో సంఘటన జరిగితే ఇబ్రహింపట్నంలో కేసు రిజిస్టర్ చేయడం వింతగా ఉందన్నారు. చంద్రబాబు పరిపాలనలో పాత్రికేయులకు స్వేచ్ఛ ఉందని, నిజాలను నిర్భయంగా రాయొచ్చు అని చెప్పారు. వైసిపి హయాంలో జిఓ ఒకటిని తీసుకొచ్చి విలేకరులను జగన్ ఇబ్బంది పెట్టారని తెలిపారు.

ఫేక్ ప్రచారాలే వైసిపి సిద్ధాంతం : ఎంపి శబరి

వైసిపి సిద్ధాంతం ఫేక్ ప్రచారాలకే పరిమితమైందని ఎంపి బైరెడ్డి శబరి విమర్శించారు. వైనాట్ 175 అంటూ ప్రగల్భాలు పలికి 11 సీట్లకే పరిమితమై ఏం చేయాలో ఆ పార్టీకి దిక్కుతోచడం లేదన్నారు. అన్న క్యాంటీన్లపై విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాలలో వైసిపి కార్యకర్తలు గొడవపడి హత్య జరిగితే టిడిపి వాళ్లే చేయించారంటూ ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

కబ్జాలపై హైడ్రా తరహా చర్యలు

- 13 జిల్లాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు
- మంత్రి పి.నారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, మధురవాడ (విశాఖపట్నం)

భూ కబ్జాలపై హైదరాబాద్‌లోని హైడ్రా తరహాలో చర్యలు చేపట్టనున్నట్టు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కబ్జాదారులు స్వచ్ఛందంగా భూములను వదిలేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశాఖ కాపులుప్పాడలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. విశాఖ నగర శివారులోని కాపులుప్పాడ ప్రాంతంలో జిందాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సింగపూర్ తరహాలో దుర్వాసన రహితంగా ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేస్ట్ టు వెల్త్ కింద రాష్ట్రంలో చేపట్టిన మొట్టమొదటి ప్రాజెక్టు ఇదేనని గుర్తు చేశారు. విశాఖపట్నం విస్తీర్ణం అంత ఉన్న సింగపూర్‌లో నాలుగు వేస్ట్ ప్లాంట్‌లు ఉన్నాయని, కోటి జనాభా కలిగిన టోక్యోలో 49 డివిజన్లకు 48 వేస్ట్ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే వాటిని పరిశీలించామని, అదే తరహాలో రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల్లో 13 వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. వైసిపి హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. ఐదేళ్లలో మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ ఈ డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన పాపాన పోలేదన్నారు. సెప్టెంబర్ నెలాఖరుకు టిడిఆర్‌ల వ్యవహారం కొలిక్కి వస్తుందన్నారు. సెప్టెంబర్ 13న మరో 70 అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నామని తెలిపారు. అక్టోబర్ 15 నాటికి పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. రుషికొండ భవనాలపై త్వరలోనే ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.



కాపులుప్పాడలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రఘుబాబు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- సినీ నటుడు రఘుబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెరగాలని, రోడ్డు ప్రమాదాల నివారణే తమ లక్ష్యం కావాలని సినీ నటుడు రఘుబాబు అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రోడ్డు భద్రతా నియమాలపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు హెల్మెట్ ధారణ విశిష్టత, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, రోడ్డు సేఫ్టీ ప్రమాణాలు పాటించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ.. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రాణం ఎంతో విలువైందని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని సూచించారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ... హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని, ఎక్కువ శాతం తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని తెలిపారు. దాంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

ప్రజారోగ్యానికి చంద్రబాబు సర్కార్ ఉరితాడు

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజారోగ్య రంగానికి చంద్రబాబునాయుడి ప్రభుత్వం ఉరితాడు బిగిస్తోందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తోందని ఎక్స్ వేదికగా మంగళవారం ట్వీట్ చేశారు. ఇప్పటికే స్పెషలిస్టు వైద్యులతో సహా వైద్య సిబ్బంది నియామకాల్ని ఆపడం ద్వారా జీరో వేకెన్సీ పాలసీకి గండికొడుతున్నారని పేర్కొన్నారు. మరోవంక బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యశ్రీని నీరుగారుస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది కొత్తగా ప్రారంభం కావాల్సిన ఐదు మెడికల్ కాలేజీలను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడమే అందుకు సాక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది ఆ మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కాకపోవడం టిడిపి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్య రంగాన్ని పటిష్టం చేయడం కోసం అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని, ఇప్పుడు వాటన్నింటినీ దెబ్బతీస్తున్నారని తెలిపారు. మెడికల్ కాలేజీలన్నింటినీ ప్రైవేటుపరం చేసి, సామాన్యుల నెత్తిన భారం మోపే విధానాల్లోకి వెళ్తున్నారని విమర్శించారు. పిపిపి మోడల్ అంటూ ప్రైవేటు కోసం, ప్రైవేటు కొరకు, ప్రైవేటు చేత, ప్రైవేటువల్ల నడుపుతున్న వ్యవస్థలా ప్రజారోగ్యరంగాన్ని మార్చేసి సామాన్యుడికి నాణ్యమైన వైద్యం అందుబాటులోలేని పరిస్థితిని తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థలకు పోటీగా ప్రభుత్వరంగం ఉన్నప్పుడే, రేట్లు అదుపులో వుంటాయని తెలిపారు. తక్షణం నిర్మాణం పూర్తి చేసుకున్న ఆ ఐదు కాలేజీల్లో తరగతులు ప్రారంభం అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నానంటూ ట్వీట్ చేశారు.

విద్యార్థినుల అస్వస్థతపై డిప్యూటీ సిఎం ఆరా!

- మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాకినాడ జిల్లా ఏలేశ్వరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయంపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆరా తీశారు. ఇదే విషయంపై అక్కడి కలెక్టరుతో మాట్లాడిన ఆయన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలందించాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. విద్యార్థినుల చికిత్స కోసం ఏలేశ్వరం ఆస్పత్రికి స్పెషలిస్టులను పంపాలన్నారు. గురుకులంలో విద్యార్థినులకు అందించిన ఆహారం, తాగునీరు పరీక్షలు చేయించాలని స్పష్టం చేశారు.

ఆందోళన చెందొద్దు : మంత్రి డోలా

విద్యార్థినులకు మెరుగైనవైద్యం అందించాలని అధికారులను సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని, విద్యార్థులందరూ క్షేమంగానే ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాల ఘటన ఆందోళనకు గురి చేసింది : లోకేష్

విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన తనను ఆందోళనకు గురిచేసిందని మంత్రి లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించాలని విద్య, వైద్య శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫైళ్ల దహనం కేసులో విచారణ ముమ్మరం

- సిఐడి విచారణతో నెలకొన్న ఉత్కంఠ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఫైళ్ల దహనం కేసును సిఐడి అధికారులు వేగవంతం చేశారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో సిఐడి డిఎస్‌పి వేణుగోపాల్, ఎస్ఐ వెంకట రమణ రెండవ రోజు మంగళవారం విచారణ కొనసాగించారు. సబ్ కలెక్టరేట్ సిబ్బందిని ఒక్కొక్కరినే పిలిచి విచారిస్తున్నారు. రాత పూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారు. సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, అడిషనల్ ఎస్‌పి రాజ్ కమల్, సిఐడి డిఎస్‌పి వేణుగోపాల్, మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు సబ్ కలెక్టరేట్లో దగ్ధమైన రికార్డులను సోమవారం రాత్రి పరిశీలించిన విషయం తెలిసిందే. ఇప్పటికే కొందరు అధికారులను అదుపులోకి తీసుకోగా.. ఈ కేసులో ప్రమేయమున్న మరికొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇప్పటి వరకు 8 మందిపై కేసులు నమోదు కాగా ఎవరినీ అరెస్టు చేయకపోవడం కొసమెరుపు. సిఐడి డిఎస్‌పి వేణుగోపాల్ మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ఫైళ్ల దగ్ధం కేసులో కార్యాలయ సిబ్బందితో స్టేట్మెంట్‌ను రీ వెరిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో స్థానిక పోలీసులు తీసుకున్న స్టేట్‌మెంట్ సిబ్బంది ఇచ్చినదేనా? అని మరోసారి నిర్ధారణ చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు.

అసెన్షియా ప్రమాదంపై విచారణ జాప్యం

- యాజమాన్యాన్ని కాపాడే యత్నంలో భాగమా?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అచ్యుతాపురం సెజ్‌లోని అసెన్షియా ఫార్మాలో జరిగిన భారీ ప్రమాదాన్ని ప్రభుత్వం పెద్ద సీరియస్‌గా తీసుకున్నట్లు కనబడ్డం లేదు. రాజకీయ విమర్శల నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం స్పందించినట్లుంది తప్పితే ప్రమాదంపై విచారణకు ఆదేశించి, చర్యలు తీసుకోవడానికి అయిష్టంగా వున్నట్లుంది. ఈ నెల 21న అసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతిచెందగా, 38 మంది గాయపడ్డారు. 22న కంపెనీ ప్రమాద ఘటనను ప్రత్యక్షంగా పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో కలిసి సిఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కంపెనీ నుంచి ఆర్థిక సహాయం ఇప్పించారు. ఈ ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని సిఎం ప్రకటించారు. ప్రమాదంపై విచారణకు ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తామని మీడియా సమావేశంలో ప్రకటించారు. ప్రమాద లోపాలపై కమిటీ నివేదిక సమర్పించిన తరువాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. కానీ ఇప్పటికీ ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారణ ప్రారంభించలేదు.

పరిశ్రమల భద్రతపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్... 24న జిల్లాలోని పరిశ్రమాధిపతులు, అధికారులతో కలిసి అనకాపల్లిలో సమావేశం నిర్వహించారు. ఇలా అంతా పరామర్శలు, సందర్శన, సమావేశాలకు పరిమితమవుతున్నారు తప్పితే ప్రమాదంపై విచారణకు కమిటీని నియమించలేదు. యాజమాన్య తప్పిదాలు బయటపడకుండా కాపాడే ప్రయత్నంలో విచారణలో జాప్యం చేసే యోచనలో ప్రభుత్వం వుందన్న విమర్శలు వినబడుతున్నాయి. ప్రమాదానికి యాజమాన్య వైఫల్యాలున్నట్లు పరిశ్రమల తనిఖీ అధికారులు ప్రమాదం జరిగిన రోజున తమ ప్రాథమిక పరిశీలనను ప్రభుత్వానికి నివేదించారు. మరుసటి రోజు చంద్రబాబు సందర్శనలో మరిన్ని లోపాలు బయటపడ్డాయి. కంపెనీ నిర్మాణంలోనే లోపాలున్నాయని మంత్రి అనిత కూడా తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం యాజమాన్య వైఫల్యాల కారణంగానే పెనుప్రమాదం సంభవించిందని చెబుతున్నప్పటికీ, విచారణ వేగవంతంచేసి చర్యలు తీసుకోవడానికి మాత్రం ప్రభుత్వం వెనుకాడ్డం గమనార్హం. ఉన్నత స్థాయి కమిటీ నియామకం ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయమని, ఇంతవరకు కమిటీ నియామకం జరగలేదని అధికారి ఒకరు తెలిపారు. కమిటీ నియామకం విషయాన్ని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వద్ద ప్రస్తావించగా మంగళవారం నియమించనుందని తెలిపారు. అయితే ఆ ప్రక్రియ సాగలేదు.

లోకో పైలెట్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎఐఎల్ఆర్ఎస్ఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లోకో పైలెట్స్ (రన్నింగ్ కార్మికులు) దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, విధుల సమయాన్ని 8 గంటలకు కుదించాలని ఎఐఎల్ఆర్ఎస్ఎ డిమాండ్ చేసింది. విజయవాడలోని రైల్వే సమావేశ మందిరంలో ఎఐఎల్ఆర్ఎస్ విజయవాడ డివిజన్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ.. రాత్రి విధులను వరుసగా రెండు రాత్రులకు మాత్రమే పరిమితం చేయాలని, హెడ్‌క్వార్టర్స్ నుంచి దూరంగా ఉండే సమయాన్ని 48 గంటలకు తగ్గించాలన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ముఖ్యంగా అసిస్టెంట్ లోకో పైలెట్స్ ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు నరసింహులు, ఎఐఎల్ఆర్ఎస్ఎ సిడబ్ల్యుఎస్ నాయకులు జి వెంకటేశ్వర్లు, విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ ఎం వెంకటేశన్, బ్రాంచ్ ప్రెసిడెంట్ ఆర్‌వి రాము, సెక్రటరీ అయాజ్, ఆర్ రవిశంకర్, కె రాజేష్, మాజీ జోనల్ సెక్రటరీ గురుమూర్తి, యూత్ సెక్రటరీ ఎంఎం కృష్ణ, రామ దుర్గారావు పాల్గొన్నారు.

డిఎపి, యూరియా తూకాల్లో తేడాలు ఉండకూడదు

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడా డిఎపి, యూరియా బస్తాల్లో తూనికలు, ధరల్లో తేడాలు లేకుండా డీలర్లు చూడాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కమిషనరు కార్యాలయంలో తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎరువుల, పురుగు మందులు తయారీదార్లు డీలర్లతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ దగ్గర్నుంచి కనీస మద్దతు ధర ప్రతిరైతుకూ అందేలా ఈ ఖరీఫ్ సమయానికి సిద్ధమవుతున్నామన్నారు. బ్లాక్ మార్కెటింగ్ ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తూనికలు, కొలతల శాఖ నిర్వహించిన దాడుల్లో ఇప్పటి వరకు 252 కేసులు నమోదు చేశామన్నారు.

కంగనా వ్యాఖ్యలకు ప్రధానిదే బాధ్యత

- రైతాంగ మహా ఉద్యమంపై విషం చిమ్మడం సిగ్గుచేటు
- రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి, ఎపి రైతు సంఘం

జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, తాడేపల్లి రూరల్

దేశంలో వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకునేందుకు రైతాంగం జరిపిన పోరాటాన్ని బిజెపి ఎంపి కంగనా రనౌత్ అత్యంత అభ్యంతరకర, అవాస్తవ వ్యాఖ్యలకు ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యత వహించి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపి కంగనా రనౌత్ వ్యాఖ్యలను ఖండిస్తూ రైతు సంఘాల సీనియర్ నాయకులు వై కేశవరావు, కెవివి ప్రసాద్, సింహాద్రి ఝాన్సీ, చుండూరు రంగారావు, కొల్లా రాజమోహన్, డి హరినాథ్, మరిది ప్రసాద్‌బాబు తదితరులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంగనా రనౌత్ దిగ్భ్రాంతికరమైన అవమానకరమైన, తప్పుడు వ్యాఖ్యలను ఎస్‌కెఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. రైతులను నిత్యం దుర్భాషలాడే ఈ ఎంపి ఇప్పుడు భారతీయ రైతులను హంతకులు, రేపిస్టులు, కుట్రదారులు, దేశ వ్యతిరేకులు అంటూ పిచ్చి ప్రేలాపనలు చేయడం అత్యంత బాధ్యతా రాహిత్యమని అన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలు, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా రైతులు శాంతియుతంగా, చట్టబద్ధంగా, భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులకు అనుగుణంగా నిరసనలు తెలిపారని గుర్తు చేశారు. అహంకార తనంతో బిజెపి చేసిన ఈ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారతదేశపు అన్నదాతలకు ప్రధాన మంత్రి అండగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని, ఇది ప్రధాన మంత్రి రాజ్యాంగ బాధ్యత అని పేర్కొన్నారు. కంగనా రనౌత్‌పై సుప్రీంకోర్టు సుమోటాగా కేసును తీసుకోవాలని కోరారు.

ఎపి రైతు సంఘం నిరసన

కంగనా రనౌత్ చౌకబారు విమర్శల పట్ల ఎపి రైతు సంఘం నిరసన వ్యక్తం చేసింది. తాడేపల్లిలోని వడ్డేశ్వరం వద్ద నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడారు. రైతాంగ మహా ఉద్యమంలో 700 మందికి పైగా రైతులు అమరులయ్యారని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ వ్యవసాయాన్ని తీసుకొచ్చేందుకు, వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా రైతులు చేసిన పోరాటాన్ని అవమానించడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, నాయకులు కొర్రపోలు ఈశ్వర్ రెడ్డి, మోదుగుల శ్రీనివాస్ రెడ్డి, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, పల్లె కృష్ణ, రజక వృత్తిదారుల సంఘం నాయకులు రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి, నీరుడు దుర్గారావు, కౌలు రైతు సంఘం నాయకులు కంచర్ల జేమ్స్, శ్రీనివాసరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి ఏలూరు మేయర్

- కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు టిడిపిలో చేరారు. నూర్జహాన్‌కు ఆమె భర్త ఎస్ఎమ్ఆర్ పెదబాబుకు టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ కండువా కప్పి మంగళవారం పార్టీలోకి ఆహ్వానించారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. వీరితోపాటు ఇయుడిఎ మాజీ ఛైర్మన్, ఏలూరు పట్టణ అధ్యక్షులు బి శ్రీనివాస్, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఎం మైబాబుతోపాటు పలువురు పార్టీలో చేరారు. వీరందరికీ లోకేష్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో ఓటమి నుంచి వైసిపి గుణపాఠం నేర్చుకోలేదని లోకేష్ ఈ సందర్భంగా విమర్శించారు.

కూతురుపై తండ్రి లైంగిక దాడి

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రే తన కూతురిపై పదేపదే లైంగిక దాడికి పాల్పడ్డాడు. భార్య మందలించినా పంచాయితీ పెట్టినా ఆ కామాంధుడిలో మార్పు రాలేదు. దీంతో నిందితునిపై భార్యే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని రోప్‌వే కాలనీకి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తెపై నిందితుడు కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఇది తెలిసిన భార్య అతనితో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే పది రోజుల కిందటే పెద్దమనుషులతో పంచాయితీ చేసుకుని, మళ్లీ తప్పు చేయనని భార్యా, పిల్లల్ని నిందితుడు కాపురానికి తీసుకువచ్చాడు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డిఎస్‌పి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే డేవిడ్‌రాజ్‌కు అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)

మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజ్‌కు అంతిమ వీడ్కోలు పలికారు. ఆయన స్వగ్రామమైన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ, కొమ్మూరి కనకారావు, సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, కాకాని సుబ్బారావు, యు.వెంకటేశ్వర్లు, ఎన్. రామారావు గ్రామస్తులు సందర్శించి.. నివాళులర్పించారు.

సిపిఎం నేత బోయి సత్యబాబుకు మాతృ వియోగం

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

బంగారమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించి బోయి సత్యబాబును పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ (ఇన్‌సెట్‌లో బోయి బంగారమ్మ (ఫైల్))

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, విజయవాడ పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబుకు మాతృవియోగం కలిగింది. సత్యబాబు మాతృమూర్తి, సిపిఎం అభిమాని బోయి బంగారమ్మ (68) మంగళవారం ఉదయం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను రెండు రోజుల క్రితం విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమెకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు సత్యబాబు. వన్‌టౌన్ గొల్లపాలెం గట్టుకొండ ప్రాంతంలోని స్వగృహం వద్ద బంగారమ్మ భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత

బంగారమ్మ భౌతికకాయాన్ని బుధవారం ఉదయం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ వైఖరేంటి? : ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం వైఖరి తెలపాలని ఎస్‌టియు డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయిశ్రీనివాస్, ఎం రఘునాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్ కంటే మెరుగైన పెన్షన్ విధానాన్ని తెస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన యుపిఎస్ ఆమోదయోగ్యం కాదని, ఉద్యోగుల కంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానం తప్ప మరే పెన్షన్ విధానాన్ని అంగీకరించబోమని తెలిపారు. సిపిఎస్ రద్దుపై వెంటనే ప్రకటన చేయాలని, లేకుంటే సెప్టెంబరు ఒకటిన అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.21 వేల కోట్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన గానీ, చర్చలు గానీ చేపట్టలేదన్నారు. సిపిఎస్ రద్దు, ఆర్థిక బకాయిలు, 12వ పిఆర్‌సి, విద్యారంగంలో చేయాల్సిన మార్పులపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని వెంటనే తెలపాలన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ మత స్వేచ్ఛకు విఘాతం

- ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ సుభహాన్

ప్రజాశక్తి-నెల్లూరు

ర్యాలీలో పాల్గొన్న ఆవాజ్ నాయకులు

వక్ఫ్ చట్ట సవరణలు చేసే ఆలోచనలకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని, లేకపోతే అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ సుభహాన్ హెచ్చరించారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సుభహాన్ మాట్లాడుతూ... చట్ట సవరణలు చేసి వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. మత స్వేచ్ఛకు ఈ చట్ట సవరణలు విఘాతం కలిగిస్తాయన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఈ అంశంపై మైనారిటీలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ మాట్లాడుతూ.. జిల్లాలో చాలా భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మైనారిటీ నాయకులు జియా ఉల్ హక్ మాట్లాడుతూ.. వక్ఫ్ చట్ట సవరణలు తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డును, వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ముస్లిం కర్తవ్యమన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.యజాన్, మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న పద్మనాభరాజు

వేతన ఒప్పందం కోసం పోర్టు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పోర్టు అండ్ డాక్ కార్మికులకు షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని, గత మూడు సంవత్సరాల బోనస్ బకాయిలను చెల్లించాలని, పోర్టు ఆస్పత్రి, ఇతర ఆస్తులను అమ్మొద్దని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ పోర్టు అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు విఎస్.పద్మనాభరాజు, బిసిహెచ్.మసేన్ మాట్లాడుతూ.. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 28 నుంచి విశాఖ పోర్టులో తలపెట్టిన నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2022 జనవరి 1 నుంచి జరగాల్సిన కొత్త వేతన ఒప్పందం కోసం ఏర్పాటు చేసిన కమిటీ ఎనిమిది సమావేశాలు జరిపినా, 32 నెలలు పూర్తయినా న్యాయబద్ధమైన ఒప్పందం నేటికీ కార్మికులకు జరగలేదన్నారు. దీనికి మోడీ ప్రభుత్వమే కారణమని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక అశాస్త్రీయమైన, అన్యాయమైన షరతులు పెట్టి ఒప్పందం జరగకుండా ఆటంకం కలిగిస్తోందన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత పోర్టు యాజమాన్యం (ఐపిఎ) రెండు శాతం ఫిట్‌మెంట్ ఇస్తామని కొత్త ప్రతిపాదన తెచ్చిందన్నారు. ఇది పాత ప్రతిపాదన కంటే చాలా తక్కువని తెలిపారు. మేజర్ పోర్టుల ఆస్తులను కార్పొరేట్, విదేశీ కంపెనీలకు అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. పోర్టు హాస్పిటల్‌ను సైతం పిపిపి క్రింద ప్రయివేట్‌కు అప్పజెప్పడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో కె.మంగయ్య నాయుడు (హెచ్ఎంఎస్), బి.లక్ష్మణరావు (సిఐటియు), జి.చందు (ఐఎన్‌టియుసి), అఖాని (సిఎఫ్‌టియుఐ), రవి (బిఎంఎస్) తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతంపై అనుమానాలు

- ఇసి క్లారిటీ ఇవ్వాల్సిందే
- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతంపై రోజురోజుకూ అనుమానాలు పెరుగుతున్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఇసిదేనని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. సచివాలయంలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్‌ను వైసిపి ప్రతినిధి బృందం మంగళవారం కలిసింది. ఈ మేరకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైసిపి నాయకులు నారాయణ మూర్తి, విల్సన్ తదితరులు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. 2024లో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల పోలింగ్ శాతం వివరాలపై తమకు అనుమానం వుందని తెలిపారు. పోలింగ్ శాతాన్ని ఇసి మూడుసార్లు వేర్వేరుగా ప్రకటించారన్నారు. ఏయే అసెంబ్లీలో ఎంత శాతం పోలింగ్ నమోదైంది? ఒక్కో అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఇసి వెల్లడించడం లేదన్నారు. ఫారం-20 సమాచారాన్ని వెంటనే అప్‌లోడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇవిఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చని చంద్రబాబు కూడా చెప్పారని అన్నారు. ఇవిఎంలలో ఎన్ని ఓట్లు పడ్డాయో వివిప్యాట్‌లో కూడా అన్నే చూపించాలని, కాని అలాంటి పరిస్థితి రాష్ట్రంలో లేదని విమర్శించారు. ఇవిఎంల బ్యాటరీ ఛార్జింగ్‌పైనా అనుమానం వుందన్నారు. ఇవిఎంలను భద్రపరిచాక ఛార్జింగ్ ఎలా పెరుగుతుందన్నారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే దుష్ప్రచారం

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను పక్కదారి పట్టించేలా హత్యలు, దౌర్జన్యాలు, దాడులు, ఆస్తుల విధ్వంసాలతోపాటు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతుందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముంబయి నటికి వేధింపులు... సజ్జల సహాయం అంటూ ఈనాడు పత్రికలో వచ్చిన కథనాన్ని అడ్డుపెట్టుకుని టిడిపి నాయకులు, టిడిపి సోషల్ మీడియా తనపై దుష్ప్రచారానికి దిగుతోందని, ఈ అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కథనాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగులకు నైటవుట్ అలవెన్సులు

- పునరుద్ధరించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ఆర్‌టిసిలో డ్రైవర్, కండక్టర్లతోపాటు ఉద్యోగులందరికీ నైటవుట్ అలవెన్సులు పునరుద్ధరించాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిపిటిడి కమిషనర్‌కు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అయ్యపురెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసిలో ఉద్యోగులందరికీ జిఓ నెంబరు 114తో ఆగస్టు నెలలో వేతనంతోపాటు చెల్లించాల్సిన అన్ని రకాల అలవెన్సులు నిలిపేయడం తగదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఆర్‌టిసి యజమాన్యం చర్చించి తక్షణం అన్ని రకాల అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రూ. 10 వేలకు శిశువు విక్రయం..

ప్రజాశక్తి-పొన్నలూరు (ప్రకాశం జిల్లా)

శిశువును రూ.పది వేలకు తల్లి విక్రయించిన ఘటన ఒంగోలు జిజిహెచ్‌లో కలకలం రేపింది. ఈ విషయాన్ని సీరియస్‌కు తీసుకున్న అధికారులు... పాపను కొనుగోలు చేసిన వారి వద్ద నుంచి తిరిగి శిశువును తీసుకువచ్చారు. ఈ సంఘటనపై పొన్నలూరు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది.

పదవుల కోసం పోటెత్తిన నేతలు

- వినతులు స్వీకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్టీ కోసం కష్టపడిన తమకు ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులను కేటాయించాలని పలువురు టిడిపి నేతలు కోరారు. తాము పార్టీ కోసం చేసిన పనిని గుర్తించి తగిన పదవి ఇచ్చి గౌరవించాలని టిడిపి కార్యాలయానికి మంగళవారం పోటెత్తారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్, కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, శ్రీరామ్ రాజగోపాల్, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇప్పించాలని పలువురు కళాకారులు కోరారు. ఆగిపోయిన ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు పనులను ప్రారంభించాలని విజయవాడలోని భవానీపురం వెల్డింగ్ వర్కర్స్ యజమానుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. వీటితోపాటు పలు అర్జీలు స్వీకరించిన నేతలు సమస్యలపై సంబంధిత అధికారులు, కలెక్టర్లు, నేతలకు ఫోన్లు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఇ-వేలం అమ్మకం ప్రకటన
తేది : 28-08-2024
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

JM FINANCIAL
www.jmfinancialarc.com
ఇ-వేలం అమ్మకపు ప్రకటన-తదుపరి అమ్మకం

IKF
ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్

సంపాదకీయం

ఆరని చిచ్చు

ఇతరుల కొంపలు తగలబెట్టి.. ఆ మంటల్లో చలికాచుకునే దుర్మార్గ వైఖరి అగ్రరాజ్యంగా చెప్పుకుంటున్న అమెరికాది. లెబనాన్‌పై ఆదివారం తెల్లవారుజామున వందలాది యుద్ధ విమానాలతో ఇజ్రాయిల్ విరుచుకుపడటంతో ఇది ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందన్న భయాందోళనలు సర్వత్రా నెలకొన్నాయి. పశ్చిమాసియాలో చెలరేగుతున్న మంటలను మరింత ఎగదోసి, ఆ ప్రాంతం మొత్తాన్ని తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలన్న అమెరికా కుట్రలో భాగమే ఇది! హిజ్బుల్లా కూడా దీటుగానే జవాబిచ్చింది. మరోవైపు ఇరాన్‌సహా పలు దేశాలు లెబనాన్‌కు అండగా నిలిచేందుకు సిద్ధమయ్యాయి. ఈ తరుణంలో తాత్కాలికంగానైనా ఇరుపక్షాలు వెనక్కి తగ్గడం కొంత ఉపశమనం.

గాజాపై ఇజ్రాయిల్ మారణహోమం మొదలు పెట్టి దాదాపు 11 నెలలు కావస్తోంది. ప్రత్యక్షంగా జరిపిన దాడుల్లో 40 వేల మందికిపైగా మరణించగా, వారిలో 18.4 శాతం మంది మహిళలు, 41.1 శాతం మంది పిల్లలు. ఇజ్రాయిల్ వైమానిక, భూతల దాడుల్లో చనిపోయిన వారితో బాటు, ఆహారం, మందులు వంటి మానవతా సరఫరాలను అందకుండా చేయడం ద్వారా ఆకలి, వ్యాధుల బారిన పడి చనిపోయినవారు, వైద్యసేవలు సకాలంలో అందక మరణించినవారు ఇవన్నీ కలుపుకుంటే మృతుల సంఖ్య లక్షా 80 వేల పైమాటేనని లండన్ నుంచి వెలువడే సుప్రసిద్ధ మెడికల్ జర్నల్ 'లాన్సెట్' వెల్లడించింది. అత్యవసర మందులు, ఆహారం కోసం వెళ్లిన వారిని సైతం హత్య చేయడం. ఆహార ట్రక్కులను అడ్డుకోవడం వంటి ఇజ్రాయిల్ దాష్టీకాల వల్ల ఇప్పుడు పోలియో విజృంభిస్తోందని ఐరాస సైతం ఆందోళన వ్యక్తం చేస్తోంది. హమాస్‌ను అంతమొందిస్తామని, బందీలను విడిపిస్తామని ప్రగల్భాలు పలికిన నెతన్యాహు ఈ పదకొండు మాసాల్లో వీటిలో ఏ ఒక్కటీ సాధించలేకపోయారు. హమాస్‌ను అంతమొందించడం అసాధ్యమని సాక్షాత్తూ ఇజ్రాయిల్ సైనిక కమాండరే చెప్పారు. హమాస్‌ను సాకుగా చూపి పాలస్తీనాను మొత్తం ఆక్రమించుకోవాలన్నది ఇజ్రాయిల్ అసలు పన్నాగం. ఇజ్రాయిల్‌ను పావుగా చేసుకుని ఇరాన్, సిరియా, లెబనాన్‌లను యుద్ధంలోకి లాగాలన్నది అమెరికా వ్యూహం. ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగితే అంతకాలం తన పదవిని పదిలంగా కాపాడుకోవచ్చన్నది ఫాసిస్టు నెతన్యాహు తలంపు. అందుకే ఈ మారణహోమాన్ని నిరంతరం కొనసాగేలా అమెరికా, నెతన్యాహు ఇద్దరూ చూస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ దాడిని సాకుగా చూపి గాజాను ఇజ్రాయిల్‌ను పెద్ద శ్మశానంగా మార్చేసింది. ఆసుపత్రులు, ఐరాస ఆధ్వర్యంలోని సంరక్షణ కేంద్రాలను సైతం వదలకుండా క్రూరమైన దాడులు చేస్తూ, చిన్నారుల, మహిళల ఉసురుతీస్తున్నది. ఇందుకుగాను ఇజ్రాయిల్‌కు అవసరమైన ఆయుధాలు, డబ్బు అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు అందిస్తున్నాయి. ఇజ్రాయిల్, అమెరికా సాగిస్తున్న ఈ దాష్టీకాలకు వ్యతిరేకంగా చికాగోసహా ప్రపంచవ్యాప్తంగా పెద్దయెత్తున సంఘీభావం వెల్లివిరిసింది. అమెరికన్ యూనివర్సిటీ విద్యార్థులు క్యాంపస్‌లలో గుడారాలు వేసుకుని వారాల తరబడి నిరసనలు తెలియజేయడం అమెరికా చరిత్రలోనే అపూర్వమైన సంఘటన.

యుద్ధ విస్తరణ కాంక్షతోనే సిరియా, ఇరాన్, లెబనాన్‌లలో హమాస్, హిజ్బుల్లాలకు చెందిన టాప్ కమాండర్లను హత్య చేయడం ద్వారా ఆ దేశాలను కవ్వించింది. హమాస్ రాజకీయ అధిపతి హనియే హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించినప్పటికీ, ఇరాన్ కొంత సంయమనం పాటించింది. జులై 31న దక్షిణ లెబనాన్‌లోని బీరూట్‌లో హిజ్బుల్లా స్థావరం వద్ద సీనియర్ కమాండర్ ఫవుద్ షుక్ర్‌ను ఇజ్రాయిల్ హత్య చేయడం తాజా ఉద్రిక్తతలకు కారణం. తమ భూభాగంలో హమాస్ నేతను హత్య చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించినప్పటికీ సంయమనం పాటిస్తోంది. షుక్ర్ హత్యపై ప్రతీకారానికి హిజ్బుల్లా సన్నద్ధమవుతుందంటూ ఇజ్రాయిల్ లెబనాన్‌పై పెద్ద యెత్తున బాంబుల వర్షం కురిపించింది. శాంతి చర్చలకు మద్దతు పేరుతో హమాస్‌ను న్యూట్రల్ చేసి, ఇజ్రాయిల్‌ను బలోపేతం చేసే ఎత్తుగడను అమెరికా మొదటి నుంచి అనుసరిస్తోంది. చర్చల సమయంలో సైతం ఇజ్రాయిల్ ఎడా పెడా దాడులు చేస్తూ ఒప్పందం కుదరకుండా అడ్డుకుంది. రెండోసారి చర్చలు జరిగినప్పుడు కాల్పుల విరమణ తరువాత కూడా గాజాలో తమ దళాలు తిష్ట వేసుక్కూర్చొనేందుకు వీలుండాలంటూ కొత్త షరతులును విధించింది. దీనిని హమాస్ వ్యతిరేకించింది. ఈ స్థితిలో గాజాలో తక్షణ కాల్పుల విరమణ జరిగేలా చూడాలి. పశ్చిమాసియాలో శాంతిని నెలకొంటే అది ప్రపంచ శాంతికి దోహదం చేస్తుంది. ఈ రీత్యా అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధ విస్తరణ యత్నాలను తిప్పికొట్టి అక్కడ శాంతిని నెలకొనేలా చూడాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉంది. అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విధానాన్ని అనుసరిస్తున్న కేంద్రప్రభుత్వం తన వైఖరి మార్చుకుని పాలస్తీనాకు సంఘీభావంగా నిలవాలి.

మహనీయుల మాట

పెట్టుబడిదారీ విధానానికి నైతిక విలువలు, నీతి నియమాలు లేవు. ప్రతిదీ అమ్మకం కోసమే.

- ఫైడల్ కాస్ట్రో

ఆగని విద్యుత్ బాదుడు-మారని విధానాలు

విశ్లేషణ

ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి, విద్యుత్ భారాలు వేయవద్దని కోరుతూ 2000 సంవత్సరంలో సిపిఎం, వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ మహోద్యమం ఉవ్వెత్తున సాగింది. ఆగస్టు 28వ తేదీన హైదరాబాద్, బషీర్‌బాగ్‌లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యమకారులపై పాశవికంగా కాల్పులు జరిపి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలను బలికొన్నది.

ఆ ఉద్యమ ఫలితంగా కొద్ది సంవత్సరాల పాటు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల జోలికి వెళ్లలేదు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల వేగం తాత్కాలికంగా తగ్గింది. ఈ 24 ఏళ్ల కాలంలో కేంద్రం, రాష్ట్రంలోని వివిధ పార్టీల ప్రభుత్వాలు చాప కింద నీరు లాగా విద్యుత్ రంగంలో ప్రమాదకర విధానాలను అమలు చేశాయి.

ఈ సంస్కరణలతో ప్రజలకు చౌకైన, నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్తు అందుతుందని పాలకులు నమ్మబలికారు. కానీ ఈ కాలంలో విద్యుత్ భారాలు మరింత పెరిగాయి. ప్రమాదాలు ఆగలేదు. కోతలు పూర్తిగా తొలగలేదు. వ్యవసాయ విద్యుత్ ఒడిదుడుకులతోనే సాగుతోంది. మొత్తంగా పాలకుల మాటలు అబద్ధాలు అని రుజువయ్యాయి. సంస్కరణలు విఫల మయ్యాయి. ప్రజలకు కష్టాలు తప్పలేదు. విద్యుత్ కార్పొరేట్ల చేతిలో బందీగా మారింది.

సిహెచ్. బాబూరావు

ఈ పది సంవత్సరాల్లో కేంద్రంలో బిజెపి విద్యుత్ రంగంలో దోపిడీని తీవ్రతరం చేసింది. కేంద్ర విద్యుత్ రంగం చట్టానికి సవరణలు చేయడానికి శత విధాల ప్రయత్నించింది. చట్ట రూపం దాల్చకపోయినా దొడ్డి దారిన ఆ దుష్ట విధానాలను అమలు చేసింది. విద్యుత్ రంగం మొత్తాన్ని అదానీ, టాటా వంటి బడా కార్పొరేట్లకు కట్టబెడుతున్నది.

విద్యుత్ బాదుడు లేకుండా చేస్తామని, ప్రైవేట్ కంపెనీల దోపిడీ అరికడతామని వైసిపి 2019లో అధికారంలోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ షరతులకు లొంగి వైసిపి ఐదేళ్లలో దొడ్డిదారిన ప్రజల కళ్ళుగప్పి ముక్కలు ముక్కలుగా 32 వేల కోట్ల రూపాయల భారం మోపింది. చార్జీల పెంపు, స్లాబుల మార్పిడి, విద్యుత్ సుంకం, స్థిర చార్జీలు, కస్టమర్ చార్జీలు, అదనపు లోడు డిపాజిట్లు ఇలా పలు రూపాలలో దండుకున్నది. టిడిపి ప్రభుత్వం తెచ్చిన ట్రూ అప్, సర్దుబాటు చార్జీల విధానాన్ని వైసిపి పూర్తి స్థాయిలో అమలు చేసింది. ఏనాడో వాడిన కరెంటుకు, లోటు సాకుతో వైసిపి పాలనలో మూడు రకాల సర్దుబాటు చార్జీలను రూ. 9863 కోట్ల అదనంగా వసూలు చేయడం దుర్మార్గం. ఆ పాలనా కాలానికి సంబంధించి మరో 17,137 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీలు మోపటానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలే ఎక్కువయ్యాయి. ప్రతి నెల ఈ వసూళ్లు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు అగ్నికి ఆజ్యం పోశాయి. సంస్కరణలలో భాగంగా వచ్చిన ఈ సర్దుబాటు చార్జీల విధానమే ప్రమాదకరం. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులతో సోలార్, విండ్, జల ఇతర రకాల విద్యుత్ చౌకగా మారింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు తగ్గాలి. కానీ భారాలు పెరగటం పాలకుల దోపిడీకి తార్కాణం.

"విద్యుత్ బాదుడు ఆపుతామని కూటమి హామీ ఇచ్చినా నేటికీ ఆగలేదు. కనీసం సర్దుబాటు చార్జీలు కూడా రద్దు చేయలేదు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు కాలేదు. పై పెచ్చు అదానీ కంపెనీ మీటర్లు తాజాగా విద్యుత్ కార్యాలయాలకు చేరుకున్నాయి. ఇంటింటికి మీటర్లు బిగించడానికి అదానీ సిబ్బంది సిద్ధమవుతున్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా మీటర్లను వ్యతిరేకించింది. హైకోర్టులో ఆ పార్టీ నేత కేసు కూడా వేశారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడితే బద్దలు కొట్టాలని ఆ నేతలు పిలుపునిచ్చారు. నేడు మాట మార్చారు. వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ ప్యానెళ్లు బిగిస్తామని చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. సర్దుబాటు చార్జీల విషయం అడిగితే, నేను రద్దు చేస్తానని చెప్పానా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అదానీ కంపెనీతో చేసుకున్న సోలార్ ఒప్పందం రద్దు పైన నోరు మెదపడం లేదు."

కార్పొరేట్ల దోపిడీ, ప్రైవేటీకరణ, అవినీతి, పాలకుల అసమర్థ, అపసవ్య విధానాలే ఈ భారాలకు కారణం. విద్యుత్ ఉత్పత్తి మొత్తం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతున్నది. ఈ సంస్థలతో ప్రభుత్వాలు అధిక రేట్లకు దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకొని ప్రజలపై రుద్దుతున్నాయి. బొగ్గు గనులు, విదేశీ బొగ్గు సరఫరా, పోర్టులు, రవాణా, ఇంధనం అన్నీ అదానీ, బడా కంపెనీల పరమై విద్యుత్ వ్యయం పెంచుతున్నాయి. అత్యవసర విద్యుత్ కొనుగోలులో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుంటున్నది. ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్, అన్ని రకాల కాంట్రాక్టులలో పాలకులు బడా సంస్థలతో కలిసి వేలాది కోట్లు దోచుకుంటున్నారు. బడా సంస్థల నుండి విద్యుత్తును కొనుగోలు చేయడానికి, ప్రభుత్వ విద్యుత్ థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి వాటిని దెబ్బ తీస్తున్నారు. పాలకులు ఇంకా ఎన్నో పాపాలకు పాల్పడ్డారు. విద్యుత్ భారాలతో మన జేబులు ఖాళీ చేస్తున్నారు. కార్పొరేట్ల ఖజానా నింపుతున్నారు. తక్షణ ప్రమాదమే కాదు. భవిష్యత్తును కార్పొరేట్ల చక్రబంధంలో ఇరికిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ పేరుతో 7 మెగావాట్ల సోలార్ విద్యుత్ 25 సంవత్సరాలు పాటు సరఫరా చేసే ఒప్పందాన్ని అదానీ కంపెనీతో చేసుకున్నది. యూనిట్ రూ.2.49 పైసలకు రాజస్థాన్ నుండి విద్యుత్ సరఫరా చేస్తారు. 25 సంవత్సరాలలో ట్రాన్స్‌మిషన్ చార్జీల పేరుతో లక్ష కోట్ల రూపాయలకు పైగా భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు కుమ్మక్కై ఈ ఒప్పందం చేశాయి. విద్యుత్ పంపిణీ సంస్థలకు సబ్సిడీ బకాయిలను (రూ.12,681 కోట్లు) ప్రభుత్వం చెల్లించ లేదు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు విద్యుత్ వాడుకొని రూ.15,157 కోట్ల బిల్లులు బకాయిలు చెల్లించలేదు. విద్యుత్ సంస్థలను అడ్డంపెట్టి వైసిపి ప్రభుత్వం అప్పులు తెచ్చి ఇతర అవసరాలకు వినియోగించుకున్నది. విద్యుత్ సంస్థలను రూ.1,12,422 కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారు. ఆ వడ్డీ భారం ప్రజలపైనే వేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేటీకరించారు. భవిష్యత్తులో పంపిణీ, సరఫరాను కూడా ప్రైవేట్ సంస్థలకు కట్ట పెట్టాలని కేంద్రం ఒత్తిడి చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోతున్నాయి.

దేశంలోని ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అప్పుల కోసం కేంద్రం షరతులకు వైసిపి లొంగిపోయింది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడానికి అంగీకరించి, పలు ప్రాంతాల్లో మీటర్లు బిగించారు. ఇదే కాకుండా ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్ పెట్టడానికి అదానీ కంపెనీతో ఒప్పందాలు చేసుకున్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు క్రమంగా ఎసరు పెట్టటానికే ఈ మీటర్లు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరతో ప్రతి ఇంటిలో ముందే బిల్లు చెల్లించి విద్యుత్ బ్యాలెన్స్ వేయించుకోవాలి. బ్యాలెన్స్ అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గంట గంటకు రీడింగ్ చూపిస్తుంది. అధిక విద్యుత్ వినియోగించే రాత్రి సమయాలలో యూనిట్‌కు అధిక చార్జీలు వసూలు చేస్తారు. విద్యుత్ మీటర్‌కు అయ్యే ఖర్చు (10 నుండి 15 వేల రూపాయలు) వినియోగదారులే భరించాలి. దీనిని 93 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారు. మీటర్ల కొనుగోలు ఒప్పందాలతో ప్రజల్ని పీల్చి పిప్పి చేసి అదానీ కంపెనీ వేలాది కోట్ల రూపాయలు దండుకుంటున్నది. హరిత విద్యుత్ పేరుతో బడా కంపెనీలకు వేల ఎకరాల భూములు కట్టబెడుతున్నారు. ఇది మరో రకమైన దోపిడి.

అనేక కారణాలతో పాటు విద్యుత్ బాదుడు, పన్నుల భారాలతో విసిగి ప్రజలు ఆగ్రహంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. విద్యుత్ బాదుడు ఆపుతామని కూటమి హామీ ఇచ్చినా నేటికీ ఆగలేదు. కనీసం సర్దుబాటు చార్జీలు కూడా రద్దు చేయలేదు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు కాలేదు. పై పెచ్చు అదానీ కంపెనీ మీటర్లు తాజాగా విద్యుత్ కార్యాలయాలకు చేరుకున్నాయి. ఇంటింటికి మీటర్లు బిగించడానికి అదానీ సిబ్బంది సిద్ధమవుతున్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా మీటర్లను వ్యతిరేకించింది. హైకోర్టులో ఆ పార్టీ నేత కేసు కూడా వేశారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడితే బద్దలు కొట్టాలని ఆ నేతలు పిలుపునిచ్చారు. నేడు మాట మార్చారు. వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ ప్యానెళ్లు బిగిస్తామని చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. సర్దుబాటు చార్జీల విషయం అడిగితే, నేను రద్దు చేస్తానని చెప్పానా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అదానీ కంపెనీతో చేసుకున్న సోలార్ ఒప్పందం రద్దు పైన నోరు మెదపడం లేదు. కేంద్రంలో కార్పొరేట్లకు దాసోహం అంటున్న బిజెపి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో కూడా భాగస్వామి అయ్యింది. నేను మారిన చంద్రబాబుని అని చెప్పుకుంటూ, మరోవైపు గతంలో తాను ప్రవేశ పెట్టిన విద్యుత్ సంస్కరణలు దేశానికి ఆదర్శమని ఇప్పుడు కూడా గొప్పలు చెప్పుకోవడం ఏమిటి? మారింది ఎక్కడా? అవే విధానాలను టిడిపి, బిజెపితో కలిసి అమలు చేయటం వాగ్దాన భంగమే కాదు, ప్రజా ద్రోహం అవుతుంది. టిడిపి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విద్యుత్ శ్వేతపత్రంలో వైసిపి ప్రభుత్వ దోపిడీ, భారాలు వివరంగా చెప్పారు. కాని కూటమి ప్రభుతం వీటన్నింటిని కొనసాగించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనం. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ వైసిపి పాలనలో విద్యుత్ రంగంలో విచ్చలవిడి అవినీతికి పాల్పడిందని...జగన్, వైసిపి బినామీ సంస్థ అని... టిడిపి నేతలు పదే పదే చెప్పారు. ఆ సంస్థతో చేసుకున్న ఒప్పందాలను, భూముల కేటాయింపులను టిడిపి సర్కారు కొనసాగించడం శోచనీయం. ఎన్నికలలో ఈ షిరిడీ సాయి కంపెనీ నుంచి టిడిపి పార్టీ రూ.40 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో (2024 జనవరి) పొందడం సిగ్గుచేటు. టిడిపి కూటమి ప్రభుత్వం 25 ఏళ్ల సంస్కరణల వైఫల్యాల అనుభవాన్ని గమనించి తమ విధానాలు మార్చుకోవాలి. విద్యుత్ భారాలు తగ్గించాలి. కార్పొరేట్ల దోపిడీ అరికట్టాలి. సర్దుబాటు చార్జీలను తక్షణమే రద్దు చేయాలి. స్మార్ట్ మీటర్లు ఆపాలి. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు తొలగించాలి. అదానీ తదితర కంపెనీలతో తీసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి. విద్యుత్ భారాలు, మీటర్లు, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా అమరవీరుల స్ఫూర్తితో మరో పోరుకు ప్రజలు సిద్ధం కావాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

ఆడపిల్ల మన ఆశ, మన భవిష్యత్తు

వ్యాఖ్య

"భారతదేశంలోని నేటి అత్యుత్తమ దృశ్యాల్లో ఒకటి ఏమంటే ఆడపిల్ల తన స్కూలు బ్యాగు వీపుపై పెట్టుకుని ఉదయం బడికి బయలుదేరడం". ఏ విద్యాభిమానో భావోద్వేగంతో చెప్పిన మాటలు కావివి. న్యాయశాస్త్రాన్ని కాచి వడపోసిన ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి తీర్పులోని వాక్యమిది!

ఈ స్పృహ మనలో ఎంత మందికి వుంది? మన విద్యారంగ పాలసీల నిర్ణేతలకు, ప్రభుత్వాలకు, సామాజిక ఉద్యమకారులకు, మేధావులకు మాత్రం ఏ మేరకుంది? ఇలా మనలందర్నీ గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తున్నట్టుంది గదూ జస్టిస్ సుధాంశు దులియా చేసిన ఈ వ్యాఖ్యల్ని చూస్తుంటే!

హిజాబ్ ధారణను తప్పనిసరి చేసిన కర్ణాటక ప్రభుత్వ ఉత్తర్వుల్ని, దాన్ని సమర్థించిన హైకోర్టు ఉత్తర్వును వ్యతిరేకిస్తూ తన అసమ్మతి తీర్పులో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు అపురూపమైనవి. ఈ సందర్భంగా మన దేశంలోని ఆడపిల్లలు నాలుగంటే నాలుగు ముక్కలు నేర్చుకోవడానికి పడుతున్న సవాలక్ష తంటాల్ని ఏమీ పట్టించుకోకుండా సంకుచిత మత భేషజాల చుట్టూ, రాజకీయాల చుట్టూ పిల్లల చదువుల్ని తిప్పి తిప్పి వాళ్ళ బంగారు భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్న మన ప్రస్తుత సామాజిక రాజకీయ ధోరణుల్ని ఆయన మందలించిన తీరు ఎంతో విలువైంది. పిల్లలు, వారి ఆకాంక్షలు, అవసరాలు, హక్కులు కేంద్రంగా లేని విద్య పట్ల ఆయన చేసిన ఈ ధిక్కారం ఇటీవల కాలంలో ఈ స్థాయి ఏ అత్యున్నత వ్యక్తీ చేయనిది.

అక్టోబర్ 2022లో ఆయన వెలువరించిన తీర్పు సారాంశం ఏమిటో ఇప్పుడు చూద్దాం.

వి. బాలసుబ్రమణ్యం

"మా ముందు ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరూ ఆడపిల్లలు! తమ గుర్తింపు కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, ఆర్టికల్ 25 కింద వారు రక్షణ కోరుతున్నారు. ఇస్లాంలో హిజాబ్ ధరించటం తప్పనిసరైన మతపరమైన నియమమా? కాదా? అనే వివాద నిర్ధారణ ఇప్పుడు అవసరం లేదు. నమ్మకం అనేది నిజాయితీతో కూడినదిగా వుండి, అది మరెవరికి హాని చేయని పక్షంలో తరగతి గదిలో హిజాబ్ నిషేధాన్ని సమర్థించడానికి కారణాలు లేవు.

"ప్రస్తుత సందర్భంలో పాఠశాలవిద్యా పరిపాలనాధికారులు ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. వారికి ఏది ముఖ్యం? ఆడపిల్లలు చదువుకోవడమా? విద్యాశాఖో, పాఠశాల యాజమాన్యమో నిర్ణయించినట్లు యూనిఫారం ధరించడమా? కర్ణాటకలోని పాఠశాలల్లో హిజాబ్ నిషేధం అమలు వల్ల దురదృష్టవశాత్తు కొంతమంది బాలికలు తమ బోర్డు పరీక్షలకు హాజరు కాలేకపోయారని పిటిషనర్ల తరఫున హాజరవుతున్న సీనియర్ న్యాయవాదులు చెబుతున్నారు. మరికొందరు విద్యార్థినులు ఈ నిబంధన కారణంగా తాము చదువుతున్న పాఠశాలను వదిలేసి మదర్సాల్లో చేరాల్సి వస్తోంది. వాటిలోని విద్యా ప్రమాణాలు ఆశించినంత స్థాయిలో లేకపోవచ్చు.

ఆమె మన ఆశ, ఆమె మన భవిష్యత్తు. అయినా ఒక ఆడపిల్లకు తన సోదరుడితో పోలిస్తే చదువుకోడం చాలా కష్టం. ఇదొక నిష్ఠుర వాస్తవం. మన గ్రామాల్లో, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఒక ఆడపిల్ల తన స్కూల్ బ్యాగ్ పట్టుకునే ముందు ఇంటిని శుభ్రం చేయాల్సి వుంటుంది. రోజువారీ పనుల్లో తన తల్లికి సహాయం చేయటం మన ఆడపిల్లలకు సర్వ సాధారణం. ఆడపిల్లకు చదువులో ఎదురయ్యే అవాంతరాలు, కష్టాలు మగపిల్లల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ. కాబట్టి 'ఒక ఆడపిల్ల తన పాఠశాలకు చేరుకోవడంలో ఎదుర్కొన్న సవాళ్లు ఎలాంటివి?' అనే కోణం నుంచి మనం చూడాలి.

"మన సమాజంలో బాలికలు చదువుకోవడానికి తరగతి గది తలుపులు తెరుచుకోవడం అంత సులభమైన విషయమేమీ కాదు. ఈరోజు ఒక ఆడపిల్ల తన స్కూలు బ్యాగు వీపుపై పెట్టుకొని ఉదయం తన పాఠశాలకు బయలుదేరడం భారతదేశంలోని అత్యుత్తమ దృశ్యాల్లో ఒకటి. ఆమె మన ఆశ, ఆమె మన భవిష్యత్తు. అయినా ఒక ఆడపిల్లకు తన సోదరుడితో పోలిస్తే చదువుకోడం చాలా కష్టం. ఇదొక నిష్ఠుర వాస్తవం. మన గ్రామాల్లో, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఒక ఆడపిల్ల తన స్కూల్ బ్యాగ్ పట్టుకునే ముందు ఇంటిని శుభ్రం చేయాల్సి వుంటుంది. రోజువారీ పనుల్లో తన తల్లికి సహాయం చేయటం మన ఆడపిల్లలకు సర్వ సాధారణం. ఆడపిల్లకు చదువులో ఎదురయ్యే అవాంతరాలు, కష్టాలు మగపిల్లల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ. కాబట్టి 'ఒక ఆడపిల్ల తన పాఠశాలకు చేరుకోవడంలో ఎదుర్కొన్న సవాళ్లు ఎలాంటివి?' అనే కోణం నుంచి మనం చూడాలి.

"అందువల్ల ఈ న్యాయస్థానం తనకు తాను వేసుకుంటున్న ప్రశ్న ఏమంటే ఆడపిల్లను చదువుల నుంచి తిరస్కరించడం ద్వారా మనం ఆమె జీవితాన్ని కుదింపజేస్తున్నామా అనేది. పిటీషనర్లు కోరుకునే హిజాబ్ ధరించడం ప్రజాస్వామ్యంలో ఏమీ అడగరానిదా? మరీ అత్యాశా? ఇది పబ్లిక్ ఆర్డర్ కో, నైతికతకో, లేదా ఆరోగ్యానికో ఎలా విరుద్ధం? మర్యాదకో, రాజ్యాంగంలోని ఇతర నిబంధనలకో ఎలా వ్యతిరేకం. తరగతి గదిలో హిజాబ్ ధరించిన ఆడపిల్ల శాంతి భద్రతల సమస్యగా, చట్టానికి సంబంధించిన సమస్యగా ఎలా మారుతుందో ఎంతగా ఆలోచించినా నా తర్కానికి అందని సమస్యగానే మిగిలిపోయింది.

దీనికంటే భిన్నత్వంతో కూడిన మనలాంటి సమాజంలో చిన్నపాటి సర్దుబాట్లతో సహజీవనానికి వీలుగా మనల్ని మనం మలుచుకోవడం పరిణతి చెందిన సమాజానికి సంకేతంగా నిలుస్తుంది. ఒక ఆడపిల్ల తన ఇంట్లో లేదా బయట హిజాబ్ ధరించే హక్కును కలిగి వుంటుంది. అంతమాత్రాన ఆమె పాఠశాల గేటు వద్ద ఆగిపోకూడదు. ఆమె పాఠశాలలో, తరగతిలో వున్నప్పుడు కూడా తన గౌరవాన్ని, గోప్యతను కాపాడుకోవల్సి వుంటుంది. ఆమె ప్రాథమిక హక్కులు ఆమెకుంటాయి. తరగతిగదిలో వున్నప్పుడు ఈ హక్కులు వుండవనడం పూర్తిగా తప్పు.

మనం ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పాలనలో జీవిస్తున్నాం. మనల్ని నియంత్రించే చట్టాలు భారత రాజ్యాంగానికి లోబడి వుండాలి. మన రాజ్యాంగం మనకు అందిస్తున్న అనేక అంశాల్లో ఒకటి విశ్వాసం. మన రాజ్యాంగం కూడా ఒక విశ్వాస పత్రమే. ఇది మెజారిటీపై మైనారిటీలు పెట్టుకున్న విశ్వాసం.

"మైనారిటీల సలహా కమిటీ నివేదికపై వ్యాఖ్యానిస్తూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 24 మే 1949న రాజ్యాంగ సభ ముందు చేసిన ఒక ప్రకటనలో ఏం చెప్పాడో చూడండి." మైనార్టీలను హడావిడిగా ఒక నిర్దిష్ట పరిస్థితులకు పరిమితం చేయటం మా ఉద్దేశం కాదు. ఈ దేశంలో మారిన పరిస్థితులలో లౌకిక రాజ్యానికి నిజమైన పునాదులు వేయడమే అందరికీ ప్రయోజనం అనే నిర్ణయానికి మైనారిటీ వారు నిజాయితీగా రావల్సి వుంటుంది. మంచిని విశ్వసించాలి. మెజారిటీ ప్రజల నిజాయితీని విశ్వసించాలి. ఇంత కంటే మైనారిటీలకు మరొక మార్గం లేదు. అలాగే మెజారిటీ జనాభా కూడా మన దేశంలోని మైనార్టీల మనోభావాలు ఎలా వున్నాయో అర్థం చేసుకోడం ముఖ్యం. తాము మైనారిటీలుగా వుండి, అలాంటి పరిస్థితులు తమకెదురైతే ఎలా వుంటామో ఆలోచించుకోవడం అవసరం". ఇవీ ఆయన వ్యాఖ్యలు.

"కర్ణాటక హైకోర్టు పిటిషనర్లు లేవనెత్తిన వైవిధ్యం ప్రశ్నను పరిగణలోనికి తీసుకోలేదు. తరగతి గది కూడా సమాజంలోని వైవిధ్యాన్ని ప్రతిబింబించే విధంగా ఉండాలని వారి ఆకాంక్ష. వైవిధ్యం, మన సాంస్కృతిక బహుళత్వం ఈ సందర్భంలో చాలా ముఖ్యమైనవి.

"మన పాఠశాలలు ప్రత్యేకించి మన ప్రీ యూనివర్సిటీ కళాశాలలు పరిపూర్ణమైన సంస్థలు. వీటిలోని పిల్లలు మన దేశపు గొప్ప వైవిధ్యాన్ని గురించి జాగృతమవుతూ, ఎదుగుతున్న వయసులోని వారు. ఇలాంటి పిల్లలకు సలహాలనిచ్చి, మార్గనిర్దేశం చేసే కేంద్రాలుగా ఇవి పని చేయాలి. అప్పుడే మన రాజ్యాంగ విలువలైన సహనం, సర్దుబాటు వారికి వొంటబడతాయి. ఇతర భాషలు మాట్లాడే వారి పట్ల, భిన్నమైన ఆహారపు అలవాట్లున్న వారి పట్ల, వేర్వేరు బట్టలు ధరించే వారి పట్ల సహనంతో, సర్దుబాటుతో ఉండాలని మన రాజ్యాంగం చెపుతున్న విలువలు వీరి అనుభవంలోకి వస్తాయి. మన వైవిధ్యాన్ని చూసి ఆందోళన చెందకుండా, దానికి ఆనందించాలని మన పిల్లలు నేర్చుకోవలసిన సమయమిది. భిన్నత్వంలోనే మన బలమున్నదని వారు గ్రహించాల్సిన సందర్భమిది.

"మన రాజ్యాంగం ప్రకారం హిజాబ్ ధరించడమనేది ఎంపికకు సంబంధించిన, స్వేచ్ఛకు సంబంధించిన విషయం. ఇది ముఖ్యమైన, మత పరమైన ఆచారానికి సంబంధించిన విషయం కావచ్చు, కాకపోవచ్చు. కానీ ఇది ఆ ఆడపిల్ల మనస్సాక్షికీ, నమ్మకానికీ, వాటి వ్యక్తీకరణకూ సంబంధించిన విషయం. ఆమె తన తరగతి గదిలో కూడా హిజాబ్ ధరించాలని కోరుకుంటే ఆమెను మనం ఆపలేము. ఎందుకంటే ఆమె సంప్రదాయవాద కుటుంబం ఆమెను పాఠశాలకు పంపడానికి అనుమతించే ఏకైక మార్గం అదే కావచ్చు.

"హిజాబ్‌ను నిరాకరించడం వల్ల కలిగే దురదృష్టకర పరిణామం ఏమంటే ఆడపిల్లలకు విద్యను నిరాకరించటం! బడికెళ్ళడం ఇప్పటికీ మన ఆడపిల్లలకు అంత తేలికగా లేదన్న వాస్తవం మనం విస్మరించ లేము. అందువల్ల ఒక ఆడపిల్ల తన పాఠశాలకు చేరుకోవడంలో ఎదుర్కొన్న సవాళ్ల కోణంలోనే ఈ కేసును కూడా చూడాలి.

"కేవలం హిజాబ్ ధరించినందుకు ఆడపిల్లలకు చదువును నిరాకరించడం ద్వారా మనం ఆమె జీవితాన్ని మెరుగు పరుస్తున్నామా అనేది కూడా కోర్టు ముందున్న ప్రశ్న. అమ్మాయిలు స్కూల్ గేట్ లోకి వెళ్ళే లోపు హిజాబ్ తీసేయమని చెప్పటం వారి వ్యక్తిగత ఎంపిక మీద దాడి చేయడం. తర్వాత వారి గౌరవంపై దాడి చేయడం. ఆ తర్వాత వారికి లౌకిక విద్యను నిరాకరించటం. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ), ఆర్టికల్ 21, ఆర్టికల్ 25(1)లను స్పష్టంగా ఉల్లంఘించడమే!"

/ వ్యాసకర్త మాజీ ఎమ్మెల్సీ /

అభిప్రాయం

చట్టాలున్నా...

నిర్భయ ఘటన మహిళల రక్షణ విషయంలో పెనుమార్పులు తెచ్చింది. జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సిఫార్సుల మేరకు దేశంలోని అన్ని జిల్లాల్లో వన్‌స్టాప్ సెంటర్లు, హెల్ప్‌లైన్లు ప్రారంభించారు. నిర్భయ స్క్వాడ్, యాప్ అందుబాటులోకి వచ్చాయి. మహిళలపై హింసను నిరోధించేందుకు గత చట్టాలను సవరించి కేంద్ర ప్రభుత్వం 2013లో 'నిర్భయ' చట్టం తీసుకు వచ్చింది. మరోపక్క పిల్లలపై లైంగిక దాడులను అరికట్టేందుకు పోక్సో చట్టం పని చేస్తోంది. అయినా, వార్తల్లోకి రానివీ, పోలీస్ స్టేషన్ల దాకా వెళ్లనివీ.. కనీసం అయిన వారికి కూడా చెప్పుకోలేని..ఘటనలు ఎన్నో.

మరేం చేయాలి?

ప్రతి ఇంటా ఆడ, మగ తేడా లేకుండా పిల్లలు పెరగాలి. మహిళలకు గౌరవం ఇవ్వడం, వారి అనుమతి లేకుండా శరీరాన్ని తాకకూడదనే స్పృహ కల్పించాలి. పోర్న్ సంస్కృతిని నిషేధించాలి. స్పై కెమెరాలను గుర్తించడం, అశ్లీలతను ప్రోత్సహిస్తోన్న కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల్లోని వీడియోలపై నియంత్రణ అవసరం. లైంగిక నేరాల కట్టడిలో పోలీస్ వ్యవస్థ పని తీరులో రాజకీయ జోక్యం కూడదు. కౌమార దశకు వచ్చిన పిల్లల్లో లైంగిక విద్యపై అవగాహన కల్పించాలి. ఇది అబ్బాయిల మధ్య అనారోగ్య కరమైన ఆకర్షణను అదుపు చేస్తుంది.

- కావ్య

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

కేజ్రీవాల్ కస్టడి పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానం కేసులో సిబిఐ నమోదు చేసిన కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి ఊరట దక్కలేదు. కస్టడీని సెప్టెంబర్ 3 వరకు రౌస్ ఎవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం నాడు పొడిగించారు. ఇంతకుముందు విధించిన కస్టడీ గడువు నేటితో ముగియడంతో కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచారు. సిబిఐ దాఖలు చేసిన నాలుగో ఛార్జిషీటుపై నిర్ణయాన్ని కూడా రౌస్ ఎవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ ఛార్జిషీటులో కేజ్రీవాల్, మరో ఐదుగురి పేర్లను సిబిఐ చేర్చింది. సెప్టెంబర్ 3న దీనిపై కోర్టు విచారణ జరపనుంది. సిబిఐ, ఇడి దర్యాప్తు చేస్తున్న ఎక్సైజ్ పాలసీ స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. కాగా, ఎక్సైజ్ పాలసీ కేసులో బెయిలు కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సెప్టెంబర్ 5న సుప్రీంకోర్టు ముందుకు రానుంది. అఫిడవిట్ సమర్పించేందుకు మరింత గడువు కావాలని సిబిఐ కోరడంతో అత్యున్నత న్యాయస్థానం గత విచారణలో సెప్టెంబర్5కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. కేజ్రీవాల్ తనకు బెయిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఒక పిటిషన్, సిబిఐ అరెస్టుకు వ్యతిరేకంగా మరో పిటిషన్ వేశారు. అయితే సిబిఐ తమ సమగ్ర అఫిడవిట్‌లో ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ కేజ్రీవాల్ డైరెక్షన్‌లో నాటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో కలిసి తీసుకున్నవేనని సిబిఐ ఆరోపణగా ఉంది. అయితే ఈ ఆరోపణలను ఆప్ తోసిపుచ్చుతూ కేజ్రీవాల్‌ను జైలులోనే ఉంచేందుకు బిజెపి, సిబిఐ కుట్రపన్నుతున్నాయని చెబుతోంది.

ఎమ్మెల్సీ కవితకు బెయిలు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కవితకు బెయిల్ మంజూరు తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మాజీ మంత్రులు గంగుల, వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కవిత బెయిల్ పై బిజెపి, కాంగ్రెస్ నేతల విమర్శలను ఖండించారు. కవిత బెయిల్ పై సంజయ్ కు అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. సంజయ్, రేవంత్ మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బెంగాల్ నుంచి రాష్ట్రానికి వచ్చిన అక్రమ డబ్బు, రాష్ట్రంలో రేవంత్ కుటుంబ సభ్యులు చేసిన స్కాంపై ఎందుకు సంజయ్ మాట్లాడడం లేదన్నారు. అలాగే.. హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీకి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎందుకు స్పందించడం లేదన్నారు.

సంకుచిత జాతీయవాదం ప్రమాదకరం

- కేరళ సాహిత్య వేత్తల పిలుపు

కన్నూర్ : సంకుచిత జాతీయవాద ధోరణుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వుండాల్సిందిగా ప్రగతిశీల చింతనాపరులకు, సాంస్కృతిక కార్యకర్తలకు కేరళ సాహిత్య వేత్తలు పిలుపునిచ్చారు. కన్నూర్‌లోని ఇ.కె.నయనార్ అకాడమీలో పురోగమన కళా సాహిత్య సంగమ్ 13వ రాష్ట్ర మహాసభ మంగళవారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షులు కె సచ్చిదానందన్ మాట్లాడుతూ దేశభక్తి పేరుతో దళితులు, ముస్లిమ్‌లపై హింస పెరగడాన్ని తీవ్రంగా ఖండించారు. సమైక్య హిందూ మతం అన్న భావనను ఆయన సవాలు చేశారు. భారత ప్రజల గురించి చెప్పేందుకు అరబ్బులు, యురోపియన్లు చారిత్రకంగా ఈ హిందూ పదాన్ని వాడేవారని ఆయన పేర్కొన్నారు. విభజించబడిన సమాజంలో ఏక హిందూమత భావన అన్నది అంతర్గతంగా లోపభూయిష్టంగా వుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త పెట్టుబడిదారీవాదం, హిందూత్వల సంకీర్ణమని ఆయన అభివర్ణించారు. ఫాసిజానికి సంబంధించిన అన్ని శక్తులు ఈ కూటమిలో వున్నాయన్నారు. భారతదేశాన్ని స్వేచ్ఛా భూమిగా మార్చేందుకు నిరంతర పోరాటం కొనసాగించాలని, అవిశ్రాంతంగా ప్రతిఘటన చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. భాష, సాహిత్యం, కళా రూపాలను సాధనాలుగా ఉపయోగించుకోవాల్సి వుందన్నారు. వర్గ, నైతిక అసమానతలను ఎదుర్కొనాలని ఆయన సాంస్కృతిక కార్యకర్తలకు పిలుపిచ్చారు. సమాజంలో పురుషాధిక్యత పెరిగిపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొత్తగా తలెత్తుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు సామాజిక వాణిని పరిపుష్టం చేయాల్సి వుందని, అత్యంత అప్రమతంగా వుండాల్సి వుందని ఆయన పునరుద్ఘాటించారు. కేరళవ్యాప్తంగా 3 వేలకు పైగా సాహిత్య సంగమ్ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు, 650 మంది రచయితలు ఈ మహాసభలో పాల్గొన్నారు.

కన్నూర్‌లో జరిగిన మహాసభలో ప్రసంగిస్తున్న కేరళ సాహిత్య అకాడమీ ఛైర్మన్ కె సచ్చిదానందన్

బెంగాల్ సచివాలయ ముట్టడి ఉద్రిక్తం

- విద్యార్థుల నిరసనలపై పోలీసుల జులుం

కొల్‌కతా : మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'చలో సచివాలయం' కార్యాక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కొల్‌కతాలో 'పశ్చిమబంగ ఛాత్ర సమాజ్' అనే విద్యార్థి సంఘం మంగళవారం చేపట్టిన ఈ ఆందోళనలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. సచివాలయం వైపు ప్రదర్శనగా వెళుతున్న విద్యార్థులను హౌరా బ్రిడ్జి వద్ద అడ్డుకునేందుకు నీటి ఫిరంగులు, భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. అంతకుముందు విద్యార్థులు పెద్ద సంఖ్యలో కాలేజ్ స్క్వేర్ వద్దకు చేరుకున్నారు. అయితే నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. సచివాలయానికి వెళ్లే దారులన్నింటినీ దిగ్బంధించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, వేలాది మంది పోలీసులను మోహరించారు. రోడ్లపై వాహనాలను, కంటైనర్లను అడ్డు పెట్టారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత, రక్షణ కల్పించడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విద్యార్థులు ఆరోపించారు. ఆందోళనకారులు ఉత్తర కోల్‌కతాలోని కాలేజ్ స్క్వేర్, హౌరాలోని సంత్రాగచి నుంచి రెండు బృందాలుగా ప్రదర్శనకు బయలుదేరారు. భద్రతాదళాలు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించుకొని ముందుకు వెళ్లేందుకు ప్రదర్శనకారులు ప్రయత్నించగా పోలీసులు వాటర్ క్యానన్లు ప్రయోగించారు. కాగా ర్యాలీ నిర్వహించకుండా విద్యార్థులను అడ్డుకోవద్దని రాజ్‌భవన్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించింది. నిరసన ప్రదర్శనను అడ్డుకోవడానికి బలప్రయోగం జరపాల్సిన అవసరమేమిటో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి అన్నారు. విద్యార్థులపై పోలీసుల అణిచివేత చర్యలను వ్యతిరేకిస్తూ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 12 గంటల పాటు సమ్మె చేపట్టాలని బిజెపి పిలుపునిచ్చింది. ఈ మేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి సుఖాంత మజుందార్ పిలుపునిచ్చారు. అయితే బిజెపి సమ్మెకు పిలుపునివ్వడంపై అధికార తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సమ్మెకు పిలుపునివ్వడం రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనే బిజెపి కుట్ర పూరిత వ్యూహానికి నిదర్శనమని అధికార తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. మరోవైపు వైద్య విద్యార్థిపై హత్యాచారం కేసులో కొల్‌కతా నగర అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనూప్ దత్తాకు కూడా పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో సాక్ష్యాధారాలు వెలుగులోకి రాకుండా ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి అనూప్ సహకరించినట్లు సిబిఐ ఆరోపిస్తోంది.

బిఎస్‌పి అధినేత్రిగా మాయావతి మళ్లీ ఎన్నిక

లక్నో : బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రిగా మాయావతి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం లక్నో పార్టీ జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి ఆఫీస్ బేరర్లు, దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులతో బిఎస్‌పి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (సిఇసి) నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ విషయాన్ని పార్టీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో పార్టీ ఎలాంటి నిరాశ చెందలేదని తెలిపింది. బిఎస్‌పి వ్యవస్థాపక, అధ్యక్షులు కాన్షిరామ్ తరువాత పార్టీ చీఫ్‌గా మాయావతి కొనసాగుతున్నారు. 2003లో తొలిసారిగా చీఫ్‌గా ఎన్నికయ్యారు. కాగా, మంగళవారం మరోసారి ఎన్నికైన సందర్భంగా మాయావతి 'దళితులు, ఆదివాసీలు, ఒబిసిల్లో జన్మించిన గొప్ప వ్యక్తుల మానవతా మిషన్‌ను బిఎస్‌పి ఉద్యమం ద్వారా ముందుకు తీసుకుని వెళ్లడానికి ఎలాంటి త్యాగానికైనా తాను సిద్ధంగా ఉన్నానని' పార్టీ నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

జెజెపితో అజాద్ పొత్తు

న్యూఢిల్లీ : రానున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జననాయక్ జనతా పార్టీ (జెజెపి), అజాద్ సామాజ్ పార్టీ (కాన్షిరాం) కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని జెజెపి అధ్యక్షులు, హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా, అజాద్ సామాజ్ పార్టీ (కాన్షిరాం) చీఫ్ చంద్రశేఖర్ అజాద్ ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో సంయుక్తంగా ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా, జెజెపి 70 స్థానాల్లోనూ, అజాద్ సామాజ్ పార్టీ (కాన్షిరాం) 20 స్థానాల్లోనూ పోటీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కూటమిపై దుశ్యంత్ చౌతాలా విశ్వాసం ప్రకటించారు.

కుల్గామ్‌లో తరిగామి నామినేషన్

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా ఫోరం అభ్యర్థిగా సిపిఎం నేత, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ తరిగామి కుల్గామ్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. కుల్గామ్ నియోజకవర్గం నుండి ఇండియా ఫోరం తరపున ఆయన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో ఇండియా ఫోరంలోని కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌తో సీట్ల సర్దుబాటు చేసుకున్న నేపథ్యంలో కుల్గామ్ నుంచి తరిగామి బరిలో నిలువాలని ఫోరంలోని పక్షాలన్నీ ఏకగ్రీవంగా నిర్ణయించాయి. దీంతో ఇక్కడ నుండి సిపిఎం అభ్యర్థిగా తరిగామి పోటీ చేస్తున్నారు. 1996 నుండి వరుసగా నాలుగుసార్లు తరిగామి ఈ నియోజకవర్గం నుండి గెలిచారు. ఈ దఫా ఎన్నికల్లో దేవ్‌సర్ నియోజకవర్గం కూడా పోటీ చేయాలని సిపిఎం తొలుత భావించినా..ఫోరంలో కీలక భాగస్వామ్యపక్షమైన నేషనల్ కాన్ఫరెన్స్ విజ్ఞప్తి మేరకు పోటీ నుంచి విరమించుకుంది. ఫోరం భాగస్వామ్య పక్షాల మధ్య ఐక్యతను కొనసాగించడం చాలా కీలకమని ఈ సందర్భంగా తరిగామి పేర్కొన్నారు. సమగ్ర దృక్పథంతో ఎన్నికలకు వెళ్ళేందుకు ఇండియా ఫోరం చేస్తున్న సమిష్టి కృషిని ఈ నిర్ణయం ప్రస్ఫుటం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు.

నార్తెర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్
NORTHERN ARC
రిజిస్టర్డు ఆఫీసు : 10వ అంతస్తు, ఫేజ్-1, ఐఐటి-మద్రాస్ రిసెర్చ్ పార్క్, కనగం గ్రామం, తారామణి, చెన్నై-600113, తమిళనాడు.
బ్రాంచి ఆఫీసు : పాత నం.2/8, కొత్త నం. 1/79, వలజాబాద్ రోడ్, మన్నివక్కం, చెన్నై-600 048, తమిళనాడు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సార్ఫసీ) యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.

ఏదైతే మీరు, ఇందు దిగువ పట్టిక లోని పేరా నం. 1లో పేర్కొనబడిన రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారులు మరియు తాకట్టుదారులు, మీ స్థిరాస్థిని తాకట్టుపెట్టుట ద్వారా నార్తెర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్ నుండి రుణం పొందియున్నారు. అదేవిధంగా మీ రందరిచేత డిఫాల్టిచెందిన దృష్ట్యా, మీ రుణ ఖాతా ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది మరియు నార్తెర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్ సార్ఫసీ యాక్ట్ క్రింద సెక్యూర్డ్ క్రెడిటర్‌గా వ్యవహరిస్తున్నారు మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసు జారీచేసి, నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను 60 రోజుల్లోగాఆ తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. నార్తెర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్‌కు మీచేత చెల్లించాల్సిన మరియు బకాయి మొత్తాలు దిగువ పట్టికలో విపులంగా వివరించబడినవి. దయచేసి గమనించండి, చెల్లించు తేదీ నాటికి సదరు మొత్తాలపై వర్తించు దానిపై తదుపరి వడ్డీ & చార్జీలు.

1. దరఖాస్తుదారు / సహ-అభ్యర్థులు / హామీదారులు & తాకట్టుదారుల పేరు / చిరునామా : **(1) మెసర్స్ అరుణ్ స్కంద సప్లయర్స్** (బిజినెస్ పేరు), చిరునామా : డోర్ నం.5-55-80, బ్రోడిపేట్ 4/19, గుంటూరు గ్రామం, గుంటూరు వెస్ట్ మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర. పిన్‌కోడ్-522002. **(2) దానబోయిన లక్ష్మినారాయణ** (రుణగ్రహీత), చిరునామా : డోర్ నం.5-69-50, సీతా హౌమ్స్ దగ్గర, 6/19 లైన్, బ్రోడిపేట్, గుంటూరు, ఆం.ప్ర.-522002, **(3) మోడి రమ్య సుధ** (సహ-రుణగ్రహీత) చిరునామా : డోర్ నం.5-69-50, సీతా హౌమ్స్ దగ్గర, 6/19 లైన్, బ్రోడిపేట్, గుంటూరు, ఆం.ప్ర.-522 002,

2. రుణ వివరాలు (డిస్బర్స్‌మెంట్ / ఎన్‌పిఏ & నోటీసు తేది / బకాయి మొత్తాలు) : రుణ ఖాతా నం. **102005482682,** మొత్తాలు : **రూ. 25,87,008/-** (రూపాయలు ఇరువై ఐదు లక్షల ఎనభై ఏడు వేల ఎనిమిది మాత్రమే). డిమాండ్ నోటీసు తేది : **13 ఆగస్టు 2024,** ఎన్‌పిఏ తేది: **03 ఆగస్టు 2024.** బకాయి మొత్తాలు **12 ఆగస్టు 2024** నాటికి **రూ.26,45,969.40 పై.లు** (రూపాయలు ఇరువై ఆరు లక్షల నలభై ఐదు వేల తొమ్మిది వందల అరవై తొమ్మిది మరియు నలభై మాత్రమే) మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు & చార్జీలు మొ॥ వాటితోపాటు వాస్తవ రియలైజేషన్ వరకు తదుపరి కాంట్రాక్చువల్ వడ్డీ.

3. స్థిరాస్తుల వివరణ : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ ఏరియా, గుంటూరు సిటీ, బ్రోడిపేట్, మున్సిపల్ టి.ఎస్.నం. 25/5, పాత వార్డు నం.2, కొత్త వార్డు నం.5, బ్లాక్ నం.1, పాత డోర్ నం.5-68-44, కొత్త డోర్ నం. 5-69-50/ఎ, ప్రస్తుత డోర్ నం. 28-10-426, అసెస్మెంట్ నం. 3692, సార లింగయ్య షాప్ దగ్గర, 6వ లైన్, 19వ క్రాస్ రోడ్, బ్రోడిపేట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్-522002, ఆర్‌సిసి ఇల్లు.

ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 రోజుల్లోగా చెల్లించు తేదీ వరకు దానిపై ఇన్సిడెంటల్ వ్యయాలు మరియు ఇతర ఖర్చులు, చార్జీలు మరియు కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు పై పట్టికలో పేర్కొన్న వివరాల ప్రకారం సరాసరి మొత్తాలను చెల్లించవలసిందిగా ఇందుమూలంగా కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, క్రింది సంతకందారు నార్తెర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్‌కు బకాయి మొత్తాల రియలైజ్‌కు ఇందు పై పేర్కొన్న తాకట్టు ఆస్తి పై సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14 క్రింద సరైన చర్యలు ప్రారంభించుటకు సిద్ధమవుదురు. తదుపరి, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) క్రింద సదరు సెక్యూర్డ్ అసెట్‌ను అమ్మకం/ లీజు లేదా ఇతర రూపాల ద్వారా కాని బదిలీచేయుట నుండి మీరు నిషేదింపబడినారు.

తేది : 28 ఆగస్టు, 2024
ప్రదేశం : బ్రోడిపేట్, గుంటూరు
సం/- అధీకృత అధికారి,
నార్తెర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్

శాంతియుత మార్గమే మేలు

- ఉక్రెయిన్ పర్యటన నేపథ్యంలో పుతిన్‌తో మోడీ

న్యూఢిల్లీ : ఘర్షణలకు తావులేని శాంతియుత పరిష్కార మార్గాలకే భారత్ కట్టుబడివుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. అమెరికా ప్రోద్బలంతో రష్యాపై ఉక్రెయిన్ కాలుదువ్వడం, అనంతరం ఉక్రెయిన్‌లో రష్యా సైనిక ఆపరేషన్ చేపట్టడంతో అక్కడ ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌లో పర్యటించివచ్చిన మోడీ మంగళవారం రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ పర్యటన విశేషాలను ఆయనతో పంచుకున్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణపై పరస్పర వైఖరులను పుతిన్‌తో పంచుకున్నట్లు తెలిపారు. సమస్యకు త్వరితగతిన, అన్ని పక్షాలు కట్టుబడి వుండేలా, శాంతియుత పరిష్కారానికి భారత్ కట్టుబడి వుందని మోడీ ఆ పోస్టులో పేర్కొన్నారు. రష్యా, భారత్ మధ్య గల ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యలపై నేతలు చర్చించారు.

బ్రిక్స్ సదస్సుకు మోడీ

అక్టోబరు 22 నుండి 24 వరకు కజన్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరవుతానని మోడీ తెలిపారు. వివిధ స్థాయిల్లో ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగించడానికి పుతిన్, మోడీలు అంగీకరించారు. ప్రస్తుతం బ్రిక్స్‌కు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రష్యా కజన్‌లో సదస్సుకు ఆతిథ్యం ఇస్తోంది. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు బ్రిక్స్‌లో చేరిన సంగతి తెలిసిందే.

గౌరవ డెట్స్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారి సమక్షంలో
O.A.NO.1010 OF 2023

వీరి మధ్య :
మెసర్స్ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
ప్రతినిధియైన దీని అధీకృత అధికారి శ్రీ ఎస్.రమేష్ కుమార్
ఆఫీసు: నెం.47-14-10, విదిషా టవర్స్, ద్వారకానగర్ మెయిన్ రోడ్, విశాఖపట్నం-530 016.
...**దరఖాస్తుదారు బ్యాంక్**

మరియు

1) **మెసర్స్ వంశీ కాటన్,** ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ.రమేష్ బాబు అమిరినేని, ఫ్లాట్ నెం.104, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ సత్యసాయి ఎన్‌క్లేవ్, డోర్ నెం.4-5-18/1, 1వ లేన్, విద్యానగర్, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్-522007.
2) **శ్రీ.రమేష్ బాబు అమిరినేని,** తండ్రి నరసింహారావు, ఫ్లాట్ నెం.104, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ సత్యసాయి ఎన్‌క్లేవ్, డోర్ నెం.4-5-18/1, 1వ లేన్, విద్యానగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007.
3) **శ్రీ.పొత్తూరి రాజేంద్రనాయుడు,** తండ్రి శ్రీ.పొత్తూరి ముని రెడ్డి, ఫ్లాట్ నెం.డి2, సాయి వెంకట రెసిడెన్సీ, 2వ లైన్ ఎక్స్‌టెన్షన్, జెకెసి నగర్, జెకెసి కాలేజీ వెనుకవైపు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006.
4) **శ్రీ.నాళం హైమావతి,** భర్త శ్రీ.రాంప్రసాద్, నెం.13-2-73, 2వ లైన్, గుంటూరు వారి తోట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001.
5) **శ్రీ.రాంప్రసాద్ నాళం,** తండ్రి కోటేశ్వరరావు నాళం, నెం.13-2-73, 2వ లైన్, గుంటూరు వారి తోట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001.
....**ప్రతివాదులు**

పత్రికా ప్రచురణ రూపంలో ప్రతివాదులు నెం. డి1 మరియు డి. 3 కి సమన్ల ప్రత్యామ్నాయ సేవ

డి. 1. **మెసర్స్ వంశీ కాటన్,** ప్రతినిధియైన మేనేజింగ్ పార్ట్‌నర్, శ్రీ.రమేష్ బాబు అమిరినేని, ఫ్లాట్ నెం.104, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ సత్యసాయి ఎన్‌క్లేవ్, డోర్ నెం.4-5-18/1, 1వ లేన్, విద్యానగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007.
డి. 2. **శ్రీ.రమేష్ బాబు అమిరినేని,** తండ్రి నరసింహారావు, ఫ్లాట్ నెం.104, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ సత్యసాయి ఎన్‌క్లేవ్, డోర్ నెం.4-5-18/1, 1వ లేన్, విద్యానగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007.
డి. 3. **శ్రీ. పొత్తూరి రాజేంద్రనాయుడు,** తండ్రి పొత్తూరి ముని రెడ్డి, ఫ్లాట్ నెం.డి2, సాయి వెంకట రెసిడెన్సీ, 2వ లైన్ ఎక్స్‌టెన్షన్, జెకెసి నగర్, జెకెసి నగర్ వెనుకవైపు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 006.

1) ఏదైతే, దరఖాస్తుదారు బ్యాంక్ ప్రస్తుత మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర ఉపశమనాలతోసహా అందులో పేర్కొన్న మొత్తాల కొరకు మీ పై రికవరీ ఆఫ్ డెట్స్ ట్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్ చట్టం, 1993లోని యొక్క సెక్షన్ 19 క్రింద దరఖాస్తును దాఖలుచేశారు. మీరు **18.09.2024**న ట్రిబ్యునల్ కన్వీనియన్స్ ప్రకారం ఉ.10.30గం.లకు లేదా ఆ తరువాత సదరు సమయానికి ఈ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరై వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌ను దాఖలుచేయుటకు ఇందుమూలంగా మీకు సమన్లు ఇవ్వబడుతున్నవి, మీరు ట్రిబ్యునల్ ముందు హాజరైనప్పుడు దరఖాస్తు మరియు అనుబంధం యొక్క కాపీని సేకరించవలసిందిగా నిర్దేశించబడ్డారు.
2) ఒకవేళ మీరు ఏదేనిపత్రాలను సమర్పించుటకు ఉద్దేశిస్తే, మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌తోసహా లిస్ట్‌తో వాటిని దాఖలు చేయవచ్చును.
3) మీరు నేరుగా లేదా సముచితంగా సూచించిన ప్లీడర్ / అడ్వకేట్ ద్వారా కాని ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరైనప్పుడు మీరిజిష్టర్డు చిరునామా మరియు మెమోను మీరు సమర్పించాలి.
4) మీరు గమనించాల్సిందేమనగా మీరు పేర్కొన్న తేదిన హాజరు అగుటలో డిఫాల్ట్ చెందిన విషయంలో, విచారించి మీకు పరోక్షముగా తీర్మానించ బడును. **తేది. 26 ఆగస్టు, 2024**న ఈ ట్రిబ్యునల్ యొక్క సీలువేసి నా సాహస్తాలతో ఇవ్వబడినది.

అసిస్టెంట్ రిజిస్ట్రార్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

తప్పుడు ప్రకటనలకు అవకాశం కల్పించే ఆయుష్ నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ : ఆయుర్వేద, సిద్ధ, యునాని ఔషధాలకు సంబంధించి తప్పుదారి పట్టించే వాణిజ్య ప్రకటనలకు పచ్చజెండా ఊపుతూ ఇటీవల ఆయుష్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల ప్రాణాలతో చలగాటమాడేందుకు వీలుకల్పిస్తారా అంటూ మొట్టికాయలు వేసింది. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ రూల్స్, 1945లోని 170వ రూల్ ప్రకారం ప్రజలను తప్పుదారి పట్టించేలా ఆయుర్వేద, సిద్ధ, యునాని ఔషదాలు, సౌందర్య ఉత్పత్తుల ప్రచారాలపై నిషేదం విధించారు. ఈ రూల్‌ను ఎత్తివేసి తప్పుడు ప్రకటనలకు మార్గం సుగమం చేసేలా ఇటీవల ఆయుష్ మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. యోగా గురు బాబా రాందేవ్‌కు చెందిన 'పతంజలి' వంటి సంస్థల తప్పుడు ప్రచారాలపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో న్యాయపర చిక్కులు రాకుండా 'పతంజలి' వంటి సంస్థల తప్పుడు ప్రకటనలకు మార్గం సుగమం చేసేలా ఆయుష్ రూల్ 170ను తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసినట్లు విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయుష్ జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌పై సుప్రీం కోర్టు మంగళవారం స్టే విధించింది. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన సమాచారం మే 7, 2024 నాటి ఉత్తర్వుల్లో వున్నాయని జస్టిస్ హిమా కొహ్లి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ తెలిపింది. తప్పుదారి పట్టించే వాణిజ్య ప్రకటనలపై సుప్రీం కోర్టు ఈ ఏడాది మే 24 నిషేధం విధిస్తూ, ఒక వాణిజ్య ప్రకటనను జారీ చేసేందుకు అనుమతించడానికి ముందుగా కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ రూల్స్, 1994 ప్రకారం అడ్వర్టయిజర్ల నుండి సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. ఆగస్టు 29, 2023 నాటి లేఖను ఉపసంహరించుకోవడానికి బదులుగా జులై 1వ తేదీన 170వ నెంబరు రూల్‌ను తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారని, అది, ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా వుందని బెంచ్ పేర్కొంది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఈ నోటిఫికేషన్ అమలుపై స్టే విధించామని బెంచ్ తెలిపింది. కాగా కేంద్రం వైఖరిని వివరిస్తూ త్వరలో అఫిడవిట్‌ను దాఖలు చేయనున్నట్లు కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ తెలిపారు.

గుజరాత్‌లో భారీ వర్షాలకు 8 మంది మృతి

అహ్మదాబాద్ : గుజరాత్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మంగళవారం కూడా రాష్ట్రాన్ని ముంచెత్తాయి. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని 96 రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. మరో 19 రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి దగ్గరగా చేరుకున్నాయి. భారీ వర్షాలకు సంబంధించిన కారణాలతో సోమవారం 8 మంది మరణించినట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. లోతట్టు ప్రాంతాల నుంచి 23,871 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపింది. అలాగే వరద నీటిలో చిక్కుకున్న దాదాపు 1,700 మంది సురక్షితంగా రక్షించినట్లు ప్రకటించింది. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ప్రకటించిన సమాచారం ప్రకారం రాష్ట్రం సగటు వార్షిక వర్షపాతంలో దాదాపు 100 ఇప్పటికే కురిసింది. నర్మదా నదికి ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహం కారణంగా సర్దార్ సరోవర్ డ్యామ్‌లోని మొత్తం 30 గేట్లకు 23 గేట్లను తెరిచారు. దీని ఫలితంగా భరూచ్ వద్ద నర్మదా ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తోంది. విశ్వామిత్రా నది కూడా ప్రమాదకర స్థాయి మించి ప్రవహిస్తోంది. దీంతో వడోదరలో అనేక లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. 3 వేలకు మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల వర్షాల కారణంగా పశ్చిమ రైల్వే 30 రైళ్లను మంగళవారం రద్దు చేసింది. 13 రైళ్లను కొద్ది దూరానికే పరిమిత చేసింది. మరో 36 రైళ్లను దారి మళ్లించింది.

పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

గుజరాత్‌లోని పలు జిల్లాకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. సౌరాష్ట్ర ప్రాంతం, కచ్, ఖేడా, ఆనంద్, పంచమహల్, దాహోద్, తాపీ, నవ్సారి, వల్సాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు రోజుల పాటు ఈ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అన్ని జిల్లాల్లోనూ విపత్తు పరిస్థితులను ఎదుర్కొవడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ దళాలను మోహరించారు.

AXIS BANK LIMITED
రిటైల్ లెండింగ్ & పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం. 30-22-79, శ్రీటవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ - 520 002

స్వాధీనతా ప్రకటన రూల్ 8 (1) క్రింద (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరుగలది) దీని రిజిస్టర్డు ఆఫీసు : "త్రిషూల్" సమర్తేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద మరియు మరో ప్రదేశంలో దీని బ్రాంచి ఆఫీసు : **రిటైల్ లెండింగ్ & పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం. 30-22-79, శ్రీటవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520 002** వద్ద కలిగియుండి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **డిమాండ్ నోటీసు** జారీచేసి, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత / హామీదారులు / తాకట్టుదారులను ఆహ్వానింపబడుచున్నది.

క్ర సం.	దరఖాస్తుదారు / సహ-దరఖాస్తుదారు / హామీదారులు పేరు చిరునామా	బకాయి రూ. లలో	ఆఫర్‌చేసిన ఈక్విటేబుల్ తాకట్టుపెట్టిన ఆస్తి & స్వాధీనతా తేది
1.	**1. శ్రీ ఎ. అభిషేక్ తండ్రి ఎ. పురుషోత్తం,** డోర్ నం.18-12-766, 2వ అంతస్తు, ఫ్లాట్ నం.5, హనుమయ్య నగర్, జండా చెట్టు లేన్ దగ్గర, చంద్రమౌళి నగర్, కొరిటిపాడు, గుంటూరు, ఆం.ప్ర.-522007. **మరియు :** రిత్విక్ ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రతినిధియైన దీని సిఈఓ: ఎ. అభిషేక్ అమరావతి రోడ్, లాడ్జి సెంటర్ ఎదురుగా, గుంటూరు, ఆం.ప్ర.-522007. **మరియు : శ్రీ ఎ. అభిషేక్,** తండ్రి ఎ. పురుషోత్తం, డోర్ నం.1-3-28/ఎ, ఫ్లాట్ నం.102, మౌర్య అపార్టుమెంట్, పవర్ ఆఫీసు ఎదురుగా, పెదపలకలూరు రోడ్, గుజ్జన గుండ్ల, గుంటూరు, ఆం.ప్ర.-522002. **2. శ్రీమతి ఎ. మహేశ్వరి భర్త ఎ. అభిషేక్,** డోర్ నం.18-12-766, 2వ అంతస్తు, ఫ్లాట్ నం.5, హనుమయ్య నగర్, జండా చెట్టు లేన్ దగ్గర, చంద్రమౌళి నగర్, కొరిటిపాడు, గుంటూరు, ఆం.ప్ర.-522007. **మరియు : శ్రీమతి ఎ. మహేశ్వరి భర్త ఎ. అభిషేక్,** డోర్ నం. 8-6-181, పద్మావతి కాలనీ, మావో కాలనీ దగ్గర, మహబూబ్‌నగర్, తెలంగాణ-509001 **డిమాండ్ నోటీసు తేది :** 22-04-2024 **రుణ ఖాతా నం. :** పిహెచ్‌ఆర్006905385563	**రూ. 37,52,382/-** (రూపాయలు ముప్పై ఏడు లక్షల యాభై రెండు వేల మూడు వందల ఎనభై రెండు మాత్రమే)	**షెడ్యూలు-ఎ :** గుంటూరు జిల్లా, కొరిటిపాడు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కొరిటిపాడు గ్రామం, డి. నం.270/బి, డోర్ నం.1-3-28/ఎ, పెదపలకలూరు రోడ్, గుజ్జన గుండ్ల, సైటు విస్తీర్ణం 3436.4చ.గ.లు మరియు **"మౌర్య సిటీ హోమ్స్"** అపార్టుమెంట్. **సరిహద్దులు : తూర్పు :** యాగంటి శికర అపార్టుమెంట్, శారదా నిలయం & పూచల టవర్స్ ఆస్తి-183.1/2అ.లు. **దక్షిణం :** గోపిశెట్టి సాంబయ్య ఆస్తి & 30 అ.ల వెడల్పు రోడ్డు-168అ.లు, **పడమర :** మద్దినేని శేషగిరి రావు ఆస్తి-183 1/2 అ.లు, **ఉత్తరం :** మౌర్య నివాస్ అపార్టుమెంట్ ఆస్తి-170అ.లు, పై సరిహద్దుల్లో 3436.40 చ.గ.లు లేదా 2873.17 చ.మీ.ల సైటు. **షెడ్యూలు-బి :** పై షెడ్యూలు-ఎలో **"మౌర్య సిటీ హోమ్స్"**అపార్టుమెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నం. 102 లో 49.09 చ.గ.లు లేదా 41.04 చ.మీ.ల విడదీయలేని & సూచించజాలని ఆస్తి భాగం. మరియు **సరిహద్దులు : తూర్పు :** ఉమ్మడి కారిడార్, **దక్షిణం :** ఒపెన్ టు స్కై, **పడమర :** ఒపెన్ టు స్కై, **ఉత్తరం :** ఒపెన్ టు స్కై. **లాంఛనప్రాయ స్వాధీనం : 23.08.2024.**
2.	**1. శ్రీ నగేశ్ అల్లు, తండ్రి రామారావు అల్లు,** ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-3, విగ్నేశ్వర రెసిడెన్సీ, లక్ష్మి నర్సింగ్ హోమ్ లైన్, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **మరియు : శ్రీ నగేశ్ అల్లు, తండ్రి రామారావు అల్లు,** ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2, విగ్నేశ్వర రెసిడెన్సీ, లక్ష్మి నర్సింగ్ హోమ్ లైన్, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **మరియు : శ్రీ నగేశ్ అల్లు, తండ్రి రామారావు అల్లు,** యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.21-25/1, తాతయ్య బాబు హాస్పిటల్, తిరువూరు రోడ్, నూజివీడు, ఆం.ప్ర.-521201. **2. శ్రీమతి అల్లు పద్మావతి,** భర్త అల్లు నగేశ్, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-3, విగ్నేశ్వర రెసిడెన్సీ, లక్ష్మి నర్సింగ్ హోమ్ లైన్, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **డిమాండ్ నోటీసు తేది :** 22.05.2024 **రుణ ఖాతా నం. :** పిహెచ్‌ఆర్006902939248 & హెచ్‌టిఆర్006902284261	**రూ. 26,11,518/-** (రూపాయలు ఇరువై ఆరు లక్షల పదకొండు వేల ఐదు వందల పద్దెనిమిది మాత్రమే)	**షెడ్యూలు-ఎ :** కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, పటమట సబ్-రిజిస్ట్రార్, విజయవాడ టౌన్, పటమట, ఆర్.ఎస్.నం.100/3, అసెస్మెంట్ నం.32021/బిఎల్‌టి, డోర్ నం.72-4-4, సైటు విస్తీర్ణం 353.0 చ.గ.లు, సరిహద్దులు: **తూర్పు :** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్, **దక్షిణం :** కొడాలి రెసిడెన్సీ ఆస్తి, **పడమర:** పలడాగు వీరభద్రయ్య ఆస్తి, **ఉత్తరం :** బ్రహ్మకుమారి ఈశ్వరయ్య యూనివర్సిటీ ఆస్తి, ఈ సరిహద్దుల్లో 353.0చ.గ.లు లేదా 294.307చ.మీ.ల విస్తీర్ణంనకుగాను 44.0 చ.గ.లు లేదా 36.78 చ.మీ.ల విడదీయలేని& సూచించజాలని భాగం. **షెడ్యూలు-బి :** మొదటి అంతస్తులో "విగ్నేశ్వర రెసిడెన్సీ" పేరున నిర్మించిన అపార్టుమెంట్‌లో ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2 ఆస్తి మరియు **సరిహద్దులు: తూర్పు :** మెట్లు & ఉమ్మడి కారిడార్, **దక్షిణం :** ఒపెన్ టు స్కై, **పడమర :** ఒపెన్ టు స్కై, **ఉత్తరం :** ఒపెన్ టు స్కై, ఈ సరిహద్దుల్లో 997 చ.అ.ల ప్లింత్ ఏరియా, మొదటి అంతస్తు ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2, ఉమ్మడి ఏరియా 146.00 చ.అ.లు మరియు 149.35చ.అ.ల కార్ పార్కింగ్ & అన్ని ఈజిమెంట్ హక్కులతోసహా. **లాంఛనప్రాయ స్వాధీనం : 23.08.2024**
3.	**1. శ్రీ మహ్మద్ హామద్ బాషా,** తండ్రి మహ్మద్ గౌస్, డోర్ నం.12-18-2000, వినాయక నగర్-2, కానూరు, యనమలకుదూరు, విజయవాడ, ఆం.ప్ర.-520007. **మరియు : శ్రీ మహ్మద్ హామద్ బాషా, తండ్రి మహ్మద్ గౌస్,** డోర్ నం.1-3-68, పెన్షన్ లైన్, సామర్లకోట, తూర్పు గోదావరి జిల్లా, ఆం.ప్ర.-533440. **మరియు: శ్రీ మహ్మద్ హామద్ బాషా, కేరాఫ్ ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్,** డోర్ నం.16-2-188, నాగేంద్ర రావు భవన్, మహేంద్ర నగర్, ఆంధ్రా హాస్పిటల్ దగ్గర, గొల్లపూడి, విజయవాడ, ఆం.ప్ర.-521225. **2. శ్రీమతి ఖైరున్నీసా సల్మా,** భర్త మహ్మద్ హామద్ పాషా, డోర్ నం.12-18-2000, వినాయక నగర్-2, కానూరు, యనమలకుదూరు, విజయవాడ, ఆం.ప్ర.-520007. **మరియు: శ్రీమతి ఖైరున్నీసా సల్మా, భర్త మహ్మద్ హామద్ బాషా,** డోర్ నం.16-490-15ఎ, వలందపాలెం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521002. **డిమాండ్ నోటీసు తేది :** 17.05.2024 **లోన్ ఖాతా నం. :** ఎల్‌పిఆర్006903065246.	**రూ. 27,51,083/-** (రూపాయలు ఇరువై ఏడు లక్షల యాభై ఒక వేల ఎనభై మూడు మాత్రమే)	కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్-రిజిస్ట్రార్, మచిలీపట్నం టౌన్, మాచవరం, వల్లందపాలెం, మున్సిపల్ వార్డు పాత నం.15 మరియు ప్రస్తుత వార్డు నం. 16, ఆర్.ఎస్.నం. 282/1, మచిలీపట్నం మున్సిపల్ ఆమోదిత లేఔట్ నం. ఎల్.పి.నం. 211/87 & ప్లాట్ నం.19, విస్తీర్ణం 255.66 చ.గ.లునకుగాను 158.67 చ.గ.లు లేదా 132.648 చ.మీ. మరియు డోర్ నం.16-490, ఆర్‌సిసి భవనము యొక్క గ్రౌండ్ & మొదటి అంతస్తులతోసహా. మరియు సరిహద్దులు : **తూర్పు :** ఎ. రామకృష్ణ ఆస్తి-34-0", **దక్షిణం :** వెండీ ఆస్తి-42-0", **పడమర :** 33అ.ల వెడల్పు రోడ్-34-0", **ఉత్తరం :** ప్లాట్ నం. 18-42.0". ఈ సరిహద్దుల మధ్య 158.67చ.గ.లు లేదా 132.648చ.మీ.ల విస్తీర్ణంతో ఆర్‌సిసి భవనముతోపాటు గ్రౌండ్ & మొదటి అంతస్తు తో అన్ని ఈజిమెంటరీ హక్కులతోసహా. **లాంఛనప్రాయ స్వాధీనం : 23.08.2024**
4.	**1. శ్రీ పల్లంపాటి శంకర్ రావు,** తండ్రి పల్లంపాటి వేంకటేశ్వర రావు, డోర్ నం. 4-25, సాయి శ్రీనివాస గోడౌన్స్ రోడ్, కేసరపల్లి, హెచ్‌సిపిసి డ్రీమ్ హోమ్, గన్నవరం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521102. **మరియు : శ్రీ పల్లంపాటి శంకర్ రావు (ప్రొప్రైటర్),** కేరాఫ్ ప్రియాంక లారి ట్రాన్స్‌పోర్ట్, గోడౌన్స్ రోడ్, కేసరపల్లి, హెచ్‌సిపిసి డ్రీమ్ హోమ్, గన్నవరం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521102. **2. శ్రీమతి పల్లంపాటి నాగమణి,** భర్త పల్లంపాటి శంకర్ రావు, డోర్ నం.4-25, సాయి శ్రీనివాస గోడౌన్స్ రోడ్, కేసరపల్లి, హెచ్‌సిపిసి డ్రీమ్ హోమ్, గన్నవరం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521102. **డిమాండ్ నోటీసు తేది :** 22-04-2024. **రుణ ఖాతా నం. :** ఎల్‌పిఆర్006902723270	**రూ. 27,74,424/-** (రూపాయలు ఇరువై ఏడు లక్షల డెబ్బై నాలుగు వేల నాలుగు వందల ఇరువై నాలుగు మాత్రమే)	కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రేషన్ జిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రీ పరిధిలో- కేసరపల్లి గ్రామం, కేసరపల్లి ఆర్.ఎస్. నం. 97/11, విజయవాడ- గుంటూరు తెనాలి - మంగళగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఎల్.పి.నం.40/2012/విజిఎ, ప్లాట్ నం. 30, విస్తీర్ణం 166.66 చ.గ.లు మొత్తం ఆస్తి భాగం. సరిహద్దులు : **తూర్పు :** 40.0 అ.ల వెడల్పు రోడ్డు-30.0 అ.లు, **దక్షిణం :** ప్లాట్ నం.29-50.0అ.లు, **పడమర :** ప్లాట్ నం. 27-30.0అ.లు, **ఉత్తరం :** ప్లాట్ నం. 31-50.0అ.లు, ఈ నాలుగు సరిహద్దుల్లో అన్ని ఈజిమెంట్ హక్కులతో 166.66 చ.గ.లు లేదా 139.34 చ.మీ.ల విస్తీర్ణపు సైటు. **లాంఛనప్రాయ స్వాధీనం : 23.08.2024**
5.	**1. శ్రీ వెంకట ముసలయ్య గంజి,** తండ్రి నరసింహా రావు గంజి, ఫ్లాట్ నం.3 ఎ4, డబ్ల్యుబి-4-1/6/9-16, బిఎంఆర్ నైన్, ఇమ్మడిశెట్టివారి పాలెం, సూర్యలంక రోడ్, బాపట్ల, గుంటూరు జిల్లా-523101. **మరియు : శ్రీ వెంకట ముసలయ్య గంజి,** తండ్రి నరసింహా రావు గంజి, డోర్ నం.3-43ఎ-1, రామకృష్ణపురం, చీరాల, ప్రకాశం-523155. **మరియు : వెంకట ముసలయ్య గంజి (ప్రొప్రైటర్), కేరాఫ్ ఎస్‌విఆర్ అఖ్వా ట్రేడర్స్,** షాప్ నం.4, బాలాజీ సిల్వర్ కాంప్లెక్స్, ఆర్.ఆర్.రోడ్, చీరాల, ప్రకాశం-523155. **2. శ్రీమతి వెంకట రాఘవమ్మ గంజి,** భర్త వెంకట ముసలయ్య గంజి, ఫ్లాట్ నం.3 ఎ4, డబ్ల్యుబి-4-1/6/9-16, బిఎంఆర్ నైన్, ఇమ్మడిశెట్టివారి పాలెం, సూర్యలంక రోడ్, బాపట్ల, గుంటూరు జిల్లా-523101. **మరియు :** శ్రీమతి వెంకట రాఘవమ్మ గంజి, భర్త వెంకట ముసలయ్య గంజి, డోర్ నం.3-43ఎ-1, రామకృష్ణ పురం, చీరాల, ప్రకాశం-523155. **డిమాండ్ నోటీసు తేది :** 09.05.2024 **రుణ ఖాతా నం. :** ఎల్‌టిఆర్006901924850	**రూ. 13,56,270/-** (రూపాయలు పదమూడు లక్షల యాభై ఆరు వేల రెండు వందల డెబ్బై మాత్రమే)	నరసారావుపేట్ రిజిస్ట్రేషన్ జిల్లా, బాపట్ల సబ్-డిస్ట్రిక్ట్, బాపట్ల మున్సిపాలిటీ, వార్డు నం. 24, వెస్ట్ బ్లాక్ నం. 4, ఇమ్మడిశెట్టిపాలెం, డోర్ నం.డబ్ల్యు.బి. 4-78, మరుప్రోలు గ్రామం, 1185చ. అ.ల (ఉమ్మడి ఏరియాలు & కార్ పార్కింగ్ ఏరియాతోకలిపి) ప్లింత్ ఏరియాతో "బి.ఎం.ఆర్.నైన్ అపార్టుమెంట్" యొక్క మూడవ అంతస్తులో గల ఒక ఫ్లాట్ నం. 3ఎ4తోపాటు "ఎ" షెడ్యూలు ఆస్తిలో 50చ.గ.ల విడదీయలేని& సూచించజాలని సైటు వాటాభాగంతో డి.నం. 97/16. **సరిహద్దులు : "ఎ" షెడ్యూలు : తూర్పు :** 100' అ.ల వెడల్పు రోడ్డు-89'7 1/2, **దక్షిణం :** ఇమ్మడిశెట్టి వేంకటేశ్వర్లుకు చెందిన ఆస్తి-313'2 1/2, **పడమర:** చాపల వీరయ్యకు చెందిన ఆస్తి-119'3", **ఉత్తరం :** వట్లూరి కొండలు & కోసరాజు సాంబయ్య మొ॥వారికి చెందిన ఆస్తి-294'7". ఈ సరిహద్దుల్లో సైటు యొక్క పూర్తి విస్తీర్ణం 3533.2 చ.గ.ల్లో 50చ.గ.ల కొలతల విడదీయలేని & సూచించజాలని భాగం. **"బి" షెడ్యూలు :** ఈజిమెంట్స్ అప్పుటెనంట్ మొ॥ వాటి హక్కులతో కలిపి ఉమ్మడి & జాయింట్ హక్కులతోపాటు అన్ని వసతులతోపాటు 1185చ.అ. (ఉమ్మడి ఏరియా & కార్ పార్కింగ్‌తోసహా) ప్లింత్ ఏరియాతో "బి.ఎం.ఆర్ నైన్ అపార్టుమెంట్" యొక్క మూడవ అంతస్తులో గల ఒక ఫ్లాట్ నం. 3ఎ4. సరిహద్దులు : **తూర్పు :** ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నం.3ఎ3 మధ్య ఒపెన్ టు స్కై, **దక్షిణం :** ఒపెన్ టు స్కై, **పడమర :** ఒపెన్ టు స్కై, **ఉత్తరం :** ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నం. 3ఎ2 మధ్య ఒపెన్ టు స్కై. **లాంఛనప్రాయ స్వాధీనం : 23.08.2024**

తేది : 23.08.2024, ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

పల్లె సొగసులు

బాలల్లారా..
పల్లెకు పోదాం రారండి..
పల్లె అందాలను చూతం రారండి..

పచ్చ పచ్చని చెట్లు
చిన్న చిన్న ఇళ్లు
చక్క చక్కని లోగిళ్ళు
అందమైన ఆవరణలు
ముత్యాల ముగ్గులు
విరిసిన కుసుమాలు
పచ్చని పైరులు
పైరు గాలుల సవ్వడులు
పక్షుల కిలకిలరావాలు
కలువల చెరువులు
పరవళ్ళుతొక్కే కాలువలు
ప్రకృతి రమణీయతలు
పాడి పశువులు
ఎడ్ల బండులు
కోడికూతల మేల్కొలుపులు
పొలాలకెళ్ళే రైతుల సందడులు
రకరకాల చేతివత్తులు
కల్మషంలేని మనుషుల ప్రేమలు
కులమతాలు లేని అనుబంధాలు
ఆప్యాయత పలకరింపులు
వీధి అరుగులపై పెద్దల ముచ్చట్లు
వీధుల్లో పిల్లగాళ్ళ ఆటపాటలు
పండుగలు పబ్బాలకు
అంబరాన్నంటే సంబరాలు
గంగిరెద్దుల ఆటలు
కుర్రకారు సరదా చేష్టలు..
అన్నదాత జన్మభూమి అందచందాలు!
అవి పల్లె సంస్కృతికి ప్రతిబింబాలు!!

– పి.వి.ప్రసాద్,
94401 76824.

సరైన పదాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పట్టికలో పక్కనే ఉన్న బొమ్మల పేర్లు ఉన్నాయి. ఎక్కడ ఉన్నాయో గుర్తించండి చూద్దాం.

moon	j	o	w	t	r	a
boat	m	c	d	q	c	r
crab	o	r	e	b	l	i
deer	o	a	e	o	o	a
cloud	n	b	r	a	u	h
chair	s	v	o	t	d	c

నేను గీసిన బొమ్మ

ఓ.రామ్ చరణ్.
8వ తరగతి
జడ్పిహెచెస్ మద్దుకుంట
కామారెడ్డి జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సంకల్పం తోడుగా .. పర్వతారోహణం!

పర్వత ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేయాలంటే- ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలు నిండుగా ఉండాలి. కొత్త ప్రాంతాల్లో సైతం ధైర్యంగా దూసుకుపోవాలి. స్లీపింగ్ బ్యాగ్, బ్యాక్ పాక్ (ట్రెక్కింగ్ బ్యాగ్), హైకింగ్ బూట్స్, యాంటీ షాక్ ట్రెక్కింగ్ పోల్స్, హ్యాట్, జాకెట్ వంటి ముఖ్య వస్తువులను మోయగలిగే సత్తా ఉండాలి. ఈ సవాళ్లను స్వీకరించి, ప్రపంచంలోని ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించే లక్ష్యంగా సాగుతున్నారు వృత్తిరీత్యా ఉపాధ్యాయిని అయిన బండారు అన్నపూర్ణ. గతంలో కిలిమంజారో పర్వతాన్ని ఎక్కిన ఆమె ... ఇటీవల యూరప్‌లోని ఎల్‌బ్రస్ పర్వత శిఖరంపై మన జాతీయ జెండాను ఎగురవేశారు.

'ఎవరేమీ అనుకున్నా... నువ్వుండే రాజ్యాన.. రాజు నువ్వే... బంటు నువ్వు, మంత్రి నువ్వే... సైన్యం నువ్వే.. అనునిత్యం పోరాడాలి... అనుకున్నది సాధించాలి'. .'అవమానాలే ఆభరణాలు.. అనుమానాలే అనుకూలాలు... సందేహాలే సందేశాలు.. ఛీత్కారాలే సన్మానాలు అనుకోవాలీ.. అడుగేయాలి.. ముళ్లమార్గాన్ని అన్వేషించాలి.. అలుపొస్తున్నా కలలే కన్నా. అనుకున్నది అధిరోహించాలి' అంటూ చంద్రబోస్ రాసిన పాటే ప్రేరణగా అన్నపూర్ణ ముందుకు సాగుతున్నారు. ఎన్నో అవమానాలు.. పెదవి విరుపులూ ఎదురైనా అనుకున్నది సాధించేదిశగా అడుగులు వేస్తున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లికి చెందిన బండారు శ్రీరామచంద్రరావు, వెంకటేశ్వర్మల దంపతుల కుమార్తె అన్నపూర్ణ. విజయవాడలోని రైల్వే మిక్సిడ్ హైస్కూలులో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. విజయవాడలోనే డిగ్రీ, కాకినాడ ఆదిత్యలో ఎంఎస్‌సి (బయోకెమిస్ట్రీ), అనంతరం బీఈడీ పూర్తి చేశారు. 2010 నుంచి 2015 విజయవాడలోని విపి సిద్ధార్థ పబ్లిక్ స్కూలులో టీచరుగా పనిచేశారు. 2015లో కంద్రపు మహేష్‌రెడ్డితో వివాహమైంది. భర్త ఉద్యోగ రీత్యా సౌదీ (యూఏఇ)కి వెళ్లారు. అక్కడి ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్ జెడ్డా (ఐఐఎస్‌జే)లో బయాలజీ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. కోవిడ్ సమయంలో తిరిగి స్వదేశానికి రావాల్సివచ్చింది. ఈ దంపతుల కుమారుడు సిద్ధార్థరెడ్డికి ఎనిమిదేళ్లు, మూడోతరగతి చదువుతున్నాడు. 2019లో కోవిడ్ సమయంలో ఆమె కొన్నాళ్లు ఇంటికే పరిమితమయ్యారు.

అవమానాలు దిగమింగుకుని ...

అన్నపూర్ణ పర్వతారోహణ లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు– 'పొడుగు తక్కువ, అంతగా ఫిజికల్ ఫిట్‌నెస్ లేదు, 'ఈవిడ సాధించగలదా?' అని అవమానించేవాళ్లే ఎక్కువగా ఉన్నారు. అయినా సరే, ఆమె లక్ష్యసాధన కోసం అహరహం కష్టపడింది. తండ్రి రైల్వే ఉద్యోగి. చిన్నప్పుడు తండ్రితోపాటు ఆమె కూడా పొలాల వెంబడి ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లేవారు. సాహస కృత్యాలు చేయటం కూడా చిన్నప్పటి నుంచే ఆమెకు అలవాటు. కోవిడ్ సమయంలో ఖాళీ సమయాల్లో ఏదో ఒకటి సాధించాలనే కుతూహలంతో పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్నారు. అమ్మ చేసిన సున్నుండలు, రాగి జావ వంటివి బలాన్ని పెంచుకోవటానికి దోహదపడ్డాయి. మొదట్లో కుటుంబ సభ్యులు తటపటాయించగా, భర్త మహేష్‌రెడ్డి మాత్రం ప్రోత్సహించారు. ఈ క్రమంలో మంగళగిరి పానకాలస్వామి కొండను రోజుకు రెండుసార్లు ఎక్కి దిగడం పర్వతారోహణ మీద పట్టునిచ్చింది. విజయవాడ ఎడ్వెంచర్ క్లబ్ (వీఏసీ) ద్వారా విజయవాడ పరిసర ప్రాంతాల్లో మిత్రులతో కలిసి ట్రెక్కింగ్‌కు కూడా వెళ్లేవారు. అలా 2020లో హిమాలయాల్లోని కేదార్‌కాంత శిఖరాన్ని ఎక్కారు. 2023 ఆగస్టు 15న ఆఫ్రికా ఖండంలో ఎత్తైన కిలిమంజారో పర్వతం ఎక్కి అక్కడ భారత జాతీయ జెండాను ఎగరేశారు. అప్పట్లో రూ.4 లక్షల వరకూ ఖర్చయ్యింది.

నేడు అన్నపూర్ణకు అభినందన

రష్యాలోని ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన బండారు అన్నపూర్ణను అభినందిస్తూ బుధవారం మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశారు. బాలోత్సవ భవన్ మొదటి అంతస్తులో మధ్యాహ్నం 12 గంటలకు ఈ సభ జరుగుతుంది.

ఎల్‌బ్రస్ పర్వతారోహణ పెద్ద సవాల్

యూరప్‌లో ఎత్తైన పర్వతమైన ఎల్‌బ్రస్ అధిరోహణ పెద్ద సవాల్‌గా మారింది. సముద్ర మట్టానికి 5,642 మీటర్లు (18,510 అడుగులు) ఎత్తులో ఉన్న ఒక నిద్రాణమైన అగ్ని పర్వతం ఇది. మైనస్ 18 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకుని లోయలాంటి ప్రదేశంలో పడిపోకుండా అత్యంత జాగ్రత్తగా అడుగు వేయాలి. అక్కడి చలి పరిస్థితులను తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భమూ ఉంది. అలాంటి పరిస్థితుల్లో మంచుకొండల్లో పనిచేస్తున్న కార్మికులను చూసి ధైర్యాన్ని కూడగట్టుకుని ముందుకు సాగారు. మన నుంచి మొత్తం 8 మంది పర్వతారోహణకు వెళ్లగా తెలంగాణా నుంచి జయసింహ, ఆంధ్రా నుంచి అన్నపూర్ణ, కోనేరు అనిత శిఖరాన్ని చేరుకున్నారు. ఈ ప్రయాణానికి రూ.5 లక్షల వరకూ ఖర్చు కాగా, ఆ మొత్తాన్ని భర్తే భరించారు. మిగతా పర్వతాల అధిరోహణకు ఆసక్తి ఉన్నా ఆర్థిక సహకారం అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూతనిస్తే భారతదేశానికి ఖ్యాతిని తెచ్చేందుకు అన్నపూర్ణ కృషి ఉపయోగపడుతుంది.

– యడవల్లి శ్రీనివాసరావు

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్నా

యూరప్‌లోని పెద్ద పర్వతమైన ఎల్‌బ్రస్ అధిరోహణకు ఈనెల 14 నుంచి వివిధ బేస్ క్యాంపుల్లో శిక్షణ పొందాను. ట్రెక్కింగ్ కూడా కొనసాగింది. ఆగస్టు 18 రాత్రి 10 గంటలకు సమ్మిట్ పుష్‌కు బయలు దేరాం. 19న ఉదయం 7.54 గంటలకు శిఖరాన్ని చేరుకున్నాం. ప్రతిరోజూ మా ట్రెక్కింగ్ కొనసాగేది. నా యాత్రకు నా భర్త మహేష్‌రెడ్డి, అమ్మ వెంకటేశ్వరమ్మ, తమ్ముడు శ్రీపతిరావు బాగా సహకరించారు. మిగతా ఐదు పర్వతాల అధిరోహణ చేసి చరిత్రలో నిలిచిపోవాలనేది నా తాపత్రయం.

- బండారు అన్నపూర్ణ, మౌంట్‌నీర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా

చిన్నారులను చిదిమేస్తున్న ఇజ్రాయిల్

- రోజుకు సగటున 53 మంది పసి పిల్లలు బలి

గాజా : పాలస్తీనా ప్రజలపై యుద్ధోన్మాదంతో రగిలిపోతున్న ఇజ్రాయిల్ చిన్నారులను చిదిమేస్తోంది. గాజాలో నెతన్యాహూ సైన్యం అత్యంత దారుణంగా, పాశవికంగా సాగిస్తున్న దాడుల్లో ఇప్పటివరకు 40,500 మంది పైగా చనిపోగా వారిలో 26 శాతం మంది పసి పిల్లలే ఉన్నారు. దాదాపు 17 వేల మంది పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోగా వేలాది మంది పిల్లలు క్షతగాత్రులయ్యారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధనేరాలు మొదలై 320 రోజులు అయింది. గతేడాది అక్టోబరు 7 నుండి ప్రతి రోజూ 53 మంది చొప్పున పిల్లలు మృత్యువాత పడుతున్నారు. 72 మంది స్త్రీ, పురుషులు చనిపోతున్నారు. మరణించిన మహిళల శాతం 18.4 శాతంగా వుంది. 40 వేల మందీ మానవ హారాన్ని ఏర్పాటు చేస్తే మన్‌హటన్ దీవి మొత్తాన్ని వారు చుట్టేయవచ్చు. అంటే 60 కిలోమీటర్ల చుట్టుకొలత వుంటుంది. సగటున ఒక వ్యక్తి గంటకు ఐదు కిలోమీటర్లు నడుస్తాడని అనుకుంటే మొత్తం మానవ హారం పూర్తి చేయడానికి 12 గంటలు పడుతుంది. అలాగే న్యూయార్క్ నగరంలోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వుంది. ఇందులో 19,500 మంది పడతారు. అంటే మాడిసన్ స్క్వేర్‌ను రెండుసార్లు భర్తీ చేయవచ్చు. 40 వేల మందినీ వరుసగా నిలుచోబెడితే ఆ లైన్ దాదాపు 24 కిలోమీటర్ల పొడవునా వుంటుంది. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి అన్ని విధాలా నిస్సిగ్గుగా సహకారమందిస్తున్న అమెరికా మృత్యుముఖానికి పసి పిల్లల మరణాలే ఉదాహరణ అంటూ అమెరికా నగరాల వరకు చిన్నారుల శవ పేటికలు పేర్చవచ్చు అని చెబుతూ ఒక జర్నలిస్టు పై విశ్లేషణ చేశారు. ఇక దాడుల సందర్భంగా శిధిలా కింద చిక్కుకుపోయి, మరణించి వుంటారని భావించిన వారు కనీసం 10వేల మంది వుంటారు. దాడులకు ముందు గాజా జనాభా 20 లక్షలు కాగా అందులో దాదాపు సగం మంది పిల్లలే. చనిపోయిన పిల్లలతో 550 క్లాస్ రూమ్‌లు నిండుతాయి. నిర్వాసితులైన పాలస్తీనియన్లు తల దాచుకోవడానికి స్కూళ్ళను ఉపయోగిస్తున్నారు. ఇటువంటివి 500కి పైగా స్కూళ్ళు వుండగా, వాటిని ఇజ్రాయిల్ లక్ష్యంగా పెట్టుకోవడంతో చాలావరకు ధ్వంసమయ్యాయి. 10 నెలల నుండి దాడులు కొనసాగుతుండడంతో గాజాలోని పిల్లలకు ఒక విద్యా సంవత్సరం పోయినట్లే.

తాజా దాడుల్లో 26 మంది మృతి

గాజాలో ప్రధానంగా డేర్ అల్ బాలాహ్, ఖాన్ యూనిస్ నగరాల్లో మంగళవారం ఉదయం 20మంది మరణించారు. మరోవైపు వెస్ట్ బ్యాంక్ శిబిరంపై ఇజ్రాయిల్ ఆర్మీ జరిపిన దాడిలో మరో 6గురు చనిపోయారు. ఇప్పటివరకు 40,476మంది చనిపోగా, 93,647మంది గాయపడ్డారు. వైద్య రంగానికి అవసరమైన ఇంధనాన్ని అందించడానికి ఇజ్రాయిల్ తిరస్కరిస్తోందని, ఆస్పత్రుల విధ్వంసమే వారి లక్ష్యంగా వుందని కమల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ విమర్శించారు. డేర్ అల్ బాలాహ్‌లో పెద్ద ఎత్తున ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ ఆదేశాలు జారీ చేయడంతో తమ సహాయక కార్యకలాపాలకు తాత్కాలికంగా విరామం ఇచ్చినట్లు ఐక్యరాజ్య సమితి పేర్కొంది.

ఐసిసి అధ్యక్షుడిగా జై షా

- ఏకగ్రీవంగా ఎన్నిక
- 27తో ముగిసిన నామినేషన్ల గడువు
- డిసెంబర్ 1న బాధ్యతల స్వీకరణ

దుబాయి: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) నూతన అధ్యక్షునిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనయుడు జై షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రస్తుత ఛైర్మన్ గ్రెగ్ బార్క్‌లే(న్యూజిలాండ్) మరో దఫా ఆ పదవిలో కొనసాగేందుకు అవకాశం ఉన్నా.. ఆయన విముఖత చూపగా.. నూతన అధ్యక్ష ఎన్నిక అనివార్యమైంది. నామినేషన్ల దాఖలుకు ఆగస్టు 27 ఆఖరు తేదీ కాగా.. ఇతర అభ్యర్థులెవరూ నామినేషన్లను దాఖలు చేయలేదు. దీంతో జై షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఐసిసికి బంగారు బాతుగా వ్యవహరిస్తున్న బిసిసిఐ.. ఇంగ్లండ్ అండ్ వేల్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ బోర్డుల నుంచి దరఖాస్తులు పడకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం. బార్క్ లే పదవీకాలం నవంబర్ 30తో ముగియనుండగా.. డిసెంబర్ 1న జై షా నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించనున్నాడు. జై షా ఆ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నాడు. దీంతో 35ఏళ్లకే ఐసిసి పీఠాన్ని అధిరోహించిన పిన్న వయస్కునిగా జై షా నిలిచాడు. భారత్ నుంచి ఐసిసి ఛైర్మన్‌గా ఎన్నికైన ఐదో వ్యక్తి జై షా. ఐసిసి ఛైర్మన్‌గా ఎన్నికపై జై షా స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని, క్రికెట్ ఫార్మాట్ల మధ్య సమ న్వయం దెబ్బతినకుండా ఉండేందుకు, సరికొత్త సాంకేతి కతను అందుబాటులోకి తెస్తానని, క్రికెట్‌ను విశ్వవ్యాప్తం తన ముందున్న ప్రధాన లక్ష్యమని తెలిపాడు. 2028లో లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడం గొప్ప విప్లవాత్మకమైన నిర్ణయమన్నాడు. ఒలింపిక్స్‌లో క్రికెట్ ప్రవేశంతో మరింత పురోగతి చెందుతుందనే నమ్మకం ఉంది' వెల్లడించాడు. 2019 అక్టోబర్ నుంచి బిసిసిఐ కార్యదర్శిగా ఉన్న షా.. 2021లో ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసిఏ) ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు.

ఫ్లాగ్ బేరర్లుగా సుమిత్, భాగ్యశ్రీ

ప్రారంభోత్సవ వేడుకల్లో 106మందితో భారత బృందం

పారిస్ పారా ఒలింపిక్స్ నేటినుంచే..

పారిస్: 17వ పారా ఒలింపిక్స్ ఫ్రాన్స్ వేదికగా బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఒలింపిక్స్ చరిత్రలో పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలు తొలిసారి స్టేడియం బయట జరిగినట్లే.. పారా ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలు కూడా అక్కడే జరగనున్నాయి. రాత్రి 11.30గం॥లకు జరిగే ప్రారంభోత్సవ వేడుకల్లో 52మంది అథ్లెట్లు, 54మంది అధికారులతో సహ మొత్తం 106మందితో కూడిన భారత బృందం పాల్గొంటోంది. ఇక భారత బృందానికి ఫ్లాగ్ బేరర్లుగా జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్(ఎఫ్-64), షాట్‌పుటర్ భాగ్యశ్రీ జాధవ్(ఎఫ్-34) ప్రాతినిధ్యం వహించనున్నారు. 10మందితో కూడిన షూటింగ్ బృందంతోపాటు గురువారం జరిగే పోటీల్లో పాల్గొనే అథ్లెట్లు పరేడ్‌లో పాల్గొనడం లేదని భారత పారా ఒలింపిక్ కమిటీ అధ్యక్షులు దేవేంద్ర ఝుజారియా మంగళవారం తెలిపారు. ప్రారంభోత్సవ వేడుకలకు సుమారు 200కి.మీ. దూరంలో షూటింగ్ పోటీలు జరగడమే ఇందుకు ప్రధాన కారణం అని ఆయన తెలిపారు. 17వ పారా ఒలింపిక్స్‌లో 22 క్రీడాంశాలకు సంబంధించి మొత్తం 549 ఈవెంట్స్ జరగనున్నాయి. సెప్టెంబర్ 8న జరిగే ముగింపు వేడుకలతో 17వ పారా ఒలింపిక్స్ ముగియనున్నాయి.

షెడ్యూల్...

తేదీ	ఈవెంట్
ఆగస్టు 28	**ప్రారంభోత్సవ వేడుకలు(రా. 11.30గం॥ల నుంచి)**
ఆగస్టు 29-సెప్టెంబర్ 1	పారా సైక్లింగ్ ట్రాక్
ఆగస్టు 29-సెప్టెంబర్ 7	పారా స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, సిట్టింగ్ వాలీబాల్
ఆగస్టు 29-31	పారా తైక్వాండో
ఆగస్టు 29-సెప్టెంబర్ 2	పారా బ్యాడ్మింటన్, వీల్‌ఛైర్ రగ్బీ
ఆగస్టు 29-సెప్టెంబర్ 5	పారా బోస్సియా, గోల్‌బాల్, ఆర్చరీ
ఆగస్టు 29-సెప్టెంబర్ 8	వీల్‌ఛైర్ బాస్కెట్‌బాల్
ఆగస్టు 30-సెప్టెంబర్ 1	**పారా రోయింగ్**
ఆగస్టు 30-సెప్టెంబర్ 5	షూటింగ్ పారా స్పోర్ట్
ఆగస్టు 30-సెప్టెంబర్ 8	పారా అథ్లెటిక్స్
ఆగస్టు 30-సెప్టెంబర్ 7	వీల్‌ఛైర్ టెన్నిస్
సెప్టెంబర్ 1 - 2	పారా ట్రయథ్లాన్
సెప్టెంబర్ 1-7	బ్లయిండ్ ఫుట్‌బాల్
సెప్టెంబర్ 2 - 7	పారా ఈక్వెస్ట్రియన్
సెప్టెంబర్ 3 - 7	వీల్‌ఛైర్ ఫెన్సింగ్
సెప్టెంబర్ 4 - 8	పారా పవర్ లిఫ్టింగ్
సెప్టెంబర్ 4 - 7	పారా సైక్లింగ్ రోడ్
సెప్టెంబర్ 5 - 7	పారా జూడో
సెప్టెంబర్ 6 - 8	పారా కనోయ్
సెప్టెంబర్ 8:	**ముగింపు వేడుకలు(రా.11.30గం॥లకు)**

'అమ్మ'కు మోహన్‌లాల్ రాజీనామా

పాలక మండలి రద్దు

కొచ్చి : మలయాళ చిత్రసీమలో నటీమణులపై పలువురు నటులు లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తనకు పాల్పడినట్లు హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ హేమా కమిటీ నివేదిక పేర్కొనడం సంచలనంగా మారింది. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ)లోని కొందరు సభ్యులపై లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అమ్మ అధ్యక్ష పదవికి మోహన్ లాల్ రాజీనామా చేశారు. మోహన్‌లాల్‌తో పాలక మండలిలోని మొత్తం 17 మంది సభ్యులు కూడా రాజీనామా చేశారు. దీంతో పాలక మండలిల రద్దు అయింది. ఈ పాలక మండలిని ఈ ఏడాది జూన్‌లోనే ఎన్నుకున్నారు. పదవీ కాలం 2027 వరకూ ఉంది.కాగా, నటి రేవతి సంపత్ చేసిన లైంగిక ఆరోపణలతో అమ్మ ప్రధాన కార్యదర్శి నటుడు సిద్దిక్ ఆదివారమే రాజీనామా చేశారు. కాగా, మలయాళ చిత్రసీమలో లైంగిక వేధింపుల నేపథ్యంలో హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ హేమ నేతృత్వంలో 2017 ఆగస్టు 19న రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఈ నెల 19న కమిటీ నివేదికను విడుదల చేసింది. ఈ కమిటీ మాదరిగానే కమిటీని ఏర్పాటు చేయాలని టాలీవుడ్, బెంగాల్ చిత్ర పరిశ్రమలోని నటీమణులు నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

వయనాడ్ పునరుజ్జీవనానికి సహకరించండి

- ప్రధాని మోడీకి కేరళ సిఎం పినరయి విజయన్ వినతి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని మోడీతో సమావేశమైన విజయన్

కొండచరియలు విరిగిపడి చిన్నాభిన్నం అయిన వయనాడ్ పునరుజ్జీవనానికి సహ కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కోరారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వయనాడ్ విపత్తుపైనే ప్రధానంగా ఆయన మోడీతో చర్చించారు. ఈ విపత్తులో సర్వం కోల్పోయిన బాధితుల పునరావాసం కోసం కేంద్రం ఉదారంగా స్పందించి సముచితమైనరీతిలో ఆర్థిక సహాయం అందించాలని కేంద్రాన్ని విజయన్ కోరినట్లు కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) తెలిపింది. ఈ విపత్తుపై వివరణాత్మక సమగ్ర నివేదికను కూడా ప్రధానికి ముఖ్యమంత్రి అందజేసినట్లు పేర్కొంది.

మరోవైపు వయనాడ్ పునరావాసంతో సహ బాధితులను ఆదుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు పినరయి విజయన్ గురువారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ప్రధానంగా బాధిత కుటుంబాలకు శాశ్వత వసతి ఏర్పాటు చేయడం పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో అన్ని వసతులతో కూడిన టౌన్‌షిప్‌ను సిద్ధం చేస్తామని ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్‌లో నిర్వహించే అఖిలపక్ష సమావేశంలో రాజకీయ పార్టీల నేతలతో పాటు రెవెన్యూ, అటవీ, జలవనరులు, విద్యుత్తు, రవాణా, రిజిస్ట్రేషన్, ఆర్థిక, పబ్లిక్ వర్క్స్, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన సంక్షేమ శాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులు పాల్గొంటారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. వయనాడ్‌లో భారీ కొండచరియలు విరిగిపడడంతో 308 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. మెప్పాడి ప్రాంతంలోని చూరల్‌మల, ముండక్కై ప్రాంతాలు పూర్తిస్థాయిలో విధ్వంసానికి గురయ్యాయి.

హర్మన్‌ప్రీత్‌కు పగ్గాలు..

టి20 మహిళల ప్రపంచకప్‌కు జట్టును ప్రకటించిన బిసిసిఐ

ముంబయి: 2024 ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌కు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) 15మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. బిసిసిఐ ప్రకటించిన 15మంది ఆటగాళ్ల బృందానికి కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన, వికెట్‌కీపర్‌గా యాస్తికా భాటియా ఎంపికయ్యారు. యువ స్పిన్నర్ శ్రేయంక పాటిల్ ఫిట్‌నెస్ సాధిస్తే తుజట్టు చోటు దక్కనుంది. ఉమా ఛెత్రి, తనుజా కన్వర్, సైమా ఠాకూర్ ట్రావెలింగ్ రిజర్వ్ ప్లేయర్స్‌గా ఎంపికయ్యారు. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ వేదికగా ఈ టోర్నీ జరగాల్సి ఉన్నా.. అక్కడి పరిస్థితుల రీత్యా యుఎఇకి మారింది. యుఎఇ వేదికగా అక్టోబర్ 10నుంచి మెగా టోర్నీ ప్రారంభం కానుంది. మెగా టోర్నీలో ఆడే 10జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో ఒక్కో జట్టు మిగిలిన జట్లతో ఒక్కోసారి తలపడనుంది. లీగ్ పోటీలు ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్ల మధ్య సెమీఫైనల్ పోరు జరగనుంది. భారత మహిళలజట్టు అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో, 6న దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌తో మ్యాచ్‌లను ఆడనుంది. అక్టోబర్ 17, 18న సెమీఫైనల్స్, 20న ఫైనల్ జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే కేటాయించారు.

జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ, దీప్తి, రోడ్రిగ్స్, రీచా ఘోష్, యాస్తికా, పుజా వస్త్రాకర్, అరుంధతి, రేణుకా, హేమలత, శోభన, రాధా, శ్రేయంకా, సంజనా.

జకోవిచ్ శుభారంభం

తొలిరౌండ్‌లోనే సుమిత్ ఓటమి

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో జకోవిచ్ 6-2, 6-2, 6-4తో ఆల్‌బోర్ట్(మోల్డోవా)పై వరుససెట్లలో నెగ్గాడు. ఇక యుఎస్ ఓపెన్‌కు నేరుగా అర్హత సాధించిన భారత సంచలనం సుమిత్ నాగల్ 1-6, 3-6, 6-7(6-8)తో గ్రీక్‌స్పూర్(ఫ్రాన్స్) చేతిలో పోరాడి ఓడాడు. 15వ సీడ్ రూనే(డెన్మార్క్) తొలిరౌండ్‌లో 2-6, 1-6, 4-6తో అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ నకషిమా చేతిలో వరుససెట్లలో ఓటమిపాలయ్యాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68